ఇక ప్రతిసోమవారం విద్యుత్ ప్రజావాణి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లా విద్యుత్ వినియోగదరులకు నేటి సోమవారం నుంచి.. ఇక ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 01 గంట వరకు ప్రతి సెక్షన్, సబ్ -డివిజన్ లోను, ఇఆర్ ఓ, డివిజన్ ఆఫీస్లలో మధ్యాహ్నం 03 గంటల నుండి సాయంత్రం 05 గంటల వరకు సర్కిల్ ఆఫీస్ లో విద్యుత్ ప్రజావాణి నిర్వహించనున్నట్టు టిజిఎన్పిడిసిఎల్ ఆపరేషన్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఆర్.రవీందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను ప్రజావాణిలో దరఖాస్తు చేసుకొని పరిష్కరించుకుంటూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నేడు(17న) సెలవు దినం ఉన్నప్పటికీ ప్రజావాణి నిర్వహించనున్నట్టు తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
సోమవారం | జూన్ 17, 2024 | www.navatelangana.com

అటవి అధికారులకు కొండ గొర్రె అప్పగింత

నవతెలంగాణ-భీంగల్



ప్రమాదవశాత్తు వ్యవసాయ క్షేత్ర బావిలో పడిన కొండగొర్రె ను అధికారులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. భీంగల్ మండలం బడా భీంగల్ గ్రామానికి చెందిన రైతు శ్రీనివాస్ తన వ్యవసాయ క్షేత్రం వద్ద ఉన్న బావిలో పడిపోయిన కొండ గొర్రెను గమనించాడు. బావిలోకి తాడు సహాయంతో దిగి కొండ గొర్రెను రక్షించి ఇంటికి తీసుకెళ్లాడు. కొండ గొర్రె విషయం అటవి అధికారులకు సమాచారం అందించారు. అటవి అధికారులు డీఆర్వో దేవిదాస్, బీట్ అధికారులు రమేష్, విజయ్ బడా భీంగల్ వెళ్లి కొండ గొర్రెను స్వాధీనం చేసుకున్నారు. అడవిలో వదిలివెస్తామని ఆటవి అధికారులు తెలిపారు.

సర్కార్‌పై ఆశలెన్నో..

- పథకాలు, హామీల అమలుకై ఎదురుచూపు
- రేషన్‌కార్డులు, గ్యాస్, ఉచిత కరెంట్, ఇతర పథకాలు అమలెప్పుడో..
- రైతుభరోసాపై రైతుల ఆశలు
- ముగిసిన ఎన్నికల తతంగం
- పాలనపై దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం
- పథకాల అమలుకు కార్యాచరణ
- తాజాగా మరోసారి ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-నిజామాబాద్

దేశ వ్యాప్తంగా ఎన్నికల తతంగం ముసిగింది. రెండు నెలల ఎన్నికల హంగామాకు తెర పడింది. కేంద్రంలో కొత్త ప్రభుత్వం కూడా కొలువుదీరింది. రాష్ట్రంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అయితే ఎన్నికల ముందు కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చింది. ఆరు నెలల్లో కొన్ని అమలు చేసింది. మరికొన్ని అమలు చేయాల్సి ఉంది. అయితే ఎన్నికల కోడ్ రావడంతో పథకాల అమలుకు బ్రేక్ పడింది. ఇప్పుడు ఎన్నికలు ముగిశాయి. కాబట్టి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలపై ప్రజలు గంపెడు ఆశలతో ఉన్నారు. ముఖ్యంగా ఆరు గ్యారంటీలపై ప్రజలు ఎదురుచూస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనపై దృష్టి పెట్టారు. పథకాల అమలుకు కార్యాచరణ రూపొందిస్తున్నారు. తాజాగా ప్రజాపాలన దరఖాస్తులను మరోసారి స్వీకరిస్తున్నారు. దీంతో పథకాల అమలుపై ప్రజలు గంపెడాశలతో ఉన్నారు.

ఆరు గ్యారంటీలపై ఆశలు..

గత అసెంబ్లీ ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. గత డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారాన్ని చేపట్టింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మొదట ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని ప్రారంభించింది. అలాగే ఆర్యోగ శ్రీ కింద చికిత్సకు రూ. పది లక్షలకు పెంచింది. దాంతోపాటు రూ.500లకే గ్యాస్, 200యూనిట్లలోపు ఉచిత కరెంట్ అమలు చేసింది. అయితే రూ.500లకే గ్యాస్, 200యూనిట్ల ఉచిత కరెంట్ అర్హులందరికీ అందలేదు. వీటి అమలు మొదట్లోనే ఎన్నికల కోడ్ రావడంతో ఇవి పూర్తి స్థాయిలో అమలు కాలేదు. గ్రామాల్లో కొందరికి మాత్రమే అమలు అయ్యాయి. చాలా మందికి మంజూరు కాలేదు. దాంతో వీటి కోసం ప్రస్తుతం అర్హులందరూ ఎదురుచూస్తున్నారు. తమకు కూడా ఖచ్చితంగా రూ.500లకే గ్యాస్, ఉచిత కరెంట్ అమలు చేయాలని కోరుతున్నారు. ఇవి ఇలా ఉంటే ఆరు గ్యారంటీల్లో ముఖ్యమైనది మహిళలకు నెలకు రూ.2500 ఇవ్వడం. 18ఏండ్లు నిండిన మహిళలకు రూ.2500 ఇస్తామని కాంగ్రెస్ చెప్పింది. ఈ పథకం అమలు కోసం కూడా మహిళలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



కొత్త రేషన్ కార్డులు వచ్చేనా..

కాంగ్రెస్ ప్రధానంగా ఎన్నికల్లో చెప్పిన విషయం కొత్త రేషన్ కార్డుల హామీ. గత బీఆర్ఎస్ పదేండ్లలో కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయలేదు. దాంతో ఉమ్మడి రాష్ట్రంలో ఇచ్చిన రేషన్ కార్డులే ఇప్పటికీ ఉన్నాయి. దీని వల్ల చాలా మంది ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా పెండ్లి చేసుకున్న వారి కష్టాలు వర్ణణతీతం. ప్రభుత్వం ఏ పథకం అమలు చేసినా రేషన్‌కార్డునే ప్రమాణికంగా తీసుకుంటుంది. దాంతో కొత్త రేషన్‌కార్డులు లేకపోవడంతో చాలా మంది అర్హులు పథకాలకు దూరం అవుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులు ఇవ్వకపోవడంతో ఆ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఇప్పుడు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అయినా కొత్త రేషన్‌కార్డులు వెంటనే మంజూరు చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. రేషన్‌కార్డులు ఇచ్చిన తరువాతే అన్నీ పథకాలు అమలు చేస్తే లబ్ధిదారులకు మేలు జరుగుతుందని భావిస్తున్నారు.



పింఛన్లు పెరిగేనా..

ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఫించన్లు డబుల్ చేస్తామని హామీ ఇచ్చింది. ప్రస్తుతం వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులకు రూ.2వేలు పింఛన్ వస్తోంది. వికలాంగులకు రూ.4వేల పింఛన్ వస్తోంది. వీటిని రెట్టింపు చేస్తామని కాంగ్రెస్ చెప్పింది. అయితే ఈ ఆరు నెలల్లో పాత పింఛన్లే ఇచ్చారు. ఇప్పుడు అయినా పింఛన్లు పెంచుతారనే ఆశతోలబ్ధిదారులు ఉన్నారు.

రైతుకు 'భరోసా' దక్కేనా..



రాష్ట్ర పురోగతిలో ప్రధానమైన రంగం వ్యవసాయం. రైతును రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాల్సిన అవసరం ఉంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు కింద ఎకరాలకు రూ.5వేల చొప్పున ఏడాదికి రెండు సార్లు రూ.10వేలు ఇచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతు భరోసా కింద రూ.15వేలు ఇస్తామని చెప్పింది. అయితే కొన్ని కారణాల వలన గత యాసంగికి రైతుబంధునే ఇచ్చింది. ప్రస్తుత ఖరీఫ్‌కు మాత్రం రైతు భరోసా ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. గత ప్రభుత్వం ఎన్ని ఎకరాల భూమి ఉన్నా రైతుబంధు ఇచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం కటాఫ్ పెట్టాలని భావిస్తోంది. వెంటనే కటాఫ్ నిర్ణయించి రైతులకు భరోసా డబ్బులు ఇవ్వాల్సిన అవసరం ఉంది. అలాగే కౌలు రైతులకు కూడా రైతు భరోసా ఇవ్వాలని కోరుతున్నారు. దీనికి తోడు రైతులకు రూ.2లక్షలు రుణమాఫీ చేస్తామని సీఎం ప్రకటించారు. దీనికి ఆగస్టు 15గడువు పెట్టారు. దీని విధివిధాలపై కూడా రైతులు ఎదురుచూస్తున్నారు. అలాగే విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూడాలని, పంటలకు బీమా సౌకర్యం, పంటలకు బోనస్ కూడా అమలు చేయాల్సి ఉంది. అలాగే రైతుబీమా కూడా అమలు చేయాల్సి ఉంది. ఇలా రాష్ట్ర ప్రభుత్వంపై అన్నివర్గాల ప్రజలు ఎన్నో ఆశలతో ఉన్నారు. ఎన్నికల వ్యవహారం ముగిసిన నేపథ్యంలో సంక్షేమ పథకాలు, గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



నిరుద్యోగుల ఎదురుచూపు..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగలను తీవ్ర నిరాశకు గురిచేసింది. స్వరాష్ట్రంలో తమకు ఉద్యోగాలు దక్కుతాయని భావించిన వారి ఆశలు నెరవేరాలేదు. దాంతో బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగుల్లో తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకుంది. గత ఎన్నికల్లో నిరుద్యోగులు బీఆర్ఎస్‌ను పట్టుబట్టి మరీ ఓడించారు. నిరుద్యోగులు ఏకమై కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. ఇప్పు డు ఉద్యోగాల కోసం నిరుద్యోగులు ఎంతో ఆశతో ఉన్నారు. కాంగ్రెస్ జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని కోరుతున్నారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం గ్రూపు-1, డీఎస్‌సీ నోటిఫిషన్ విడుదల చేసింది. వీటి ప్రక్రియ కొనసాగుతోంది. వీటితోపాటు ఇతర శాఖల్లో ఖాళీగా ఉన్న భర్తీలను సైతం పూర్తిగా భర్తీ చేయాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్‌ను కలిసిన సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి

మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచాలని మున్సిపల్ కార్మికుల జిల్లా అధ్యక్షుడు రాజనర్సు కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డిను మున్సిపల్ జిల్లా నాయకులు (సిఐటియు) ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికుల జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం 26,000 ఇవ్వాలని, రెండవ పిఆర్సి ప్రకారం వేతనాలు పెంచాలని తెలిపారు. ఆలోపు పక్క రాష్ట్రంలో ఇస్తున్న విధంగా రూ.21000 లను అమలు చేయాలన్నారు. సీఎం పెంచిన వెయ్యి రూపాయలు అమలు చేయాలని, స్థానికంగా ఉన్న సమస్యలను పెండింగ్లో ఉన్న పిఎఫ్ డబ్బులను సానిటేషన్‌లో చేస్తున్న 100 మంది కార్మికులకు పెండింగ్ జీతాలు ఇస్తు జీవో నెంబర్ 4 ప్రకారం అందరితోపాటు రూ.16,600 ఇవ్వాలని తెలిపారు. అలాగే సంవత్సరానికి రెండు జతల బట్టలు, సబ్బులు, నూనెలు, చెప్పులు, పనిముట్లు అందజేయాలని వారికి వినతిపత్రం ద్వారా తెలియజేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యలపై వెంటనే చైర్పర్సన్ స్పందిస్తూ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తానని, పిఎఫ్, డబ్బులు కొన్ని నెలలు కట్టామని మిగతా బకాయి డబ్బులను కూడా త్వరలోనే చెల్లిస్తామని తెలిపారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు స్థానిక ప్రజా ప్రతినిధులకు చైర్పర్సన్, కమిషనర్, ఎమ్మెల్యే, ఎంపీ 26న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం చేపడుతున్నామని, జులై మొదటి వారంలో ఛలో సిడిఎంఏ ఆఫీస్ ముట్టడి కార్యక్రమం ఉన్నదని, చైర్పర్సన్‌కు ముందుగా సమాచారం ఇచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి మహబూబ్ అలీ, ఉపాధ్యక్షులు పోతారం ప్రభాకర్, టి.దీపక్, కాత్రియాల ప్రభు, తదితరులు పాల్గొన్నారు.



చైర్‌పర్సన్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

23, 24న

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమావేశాలు

- జయప్రదం చేయండి : సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఈనెల 23, 24న నగరంలోని జనార్దన్ గార్డెన్‌లో జరిగే రాష్ట్ర కమిటీ సమావేశాల జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు పిలుపునిచ్చారు. నాందేవ్‌వాడలో గల తెలంగాణలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆహ్వాన సంఘం కమిటీ వేశారు. ఈ సమావేశానికి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్ హాజరయ్యారు. ఈ సమావేశానికి అధ్యక్షత సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట్రాములు వహించగా ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఏషాల గంగాధర్, సంఘానికి మద్దతుగా తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకటేష్, వడ్డెర వత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షులు ఇడగొట్టి సాయిలు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పెద్ది సూరి, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి, సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గా శశికళ, గోశం లక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శి నర్ర శంకర్, సభ్యులు గా చంద్రకాంత్, నాగుల గోవర్ధన్, బోండ్ల లక్ష్మీ నరసయ్య, రాజేశ్వరి, నర్ర కల, ఎస్. సాయిలు, శీను, దూపల్లి సాయిలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్ రాములు, బుర్రి ప్రసాద్ లు మాట్లాడుతు... కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి కూలీలని విడమరుస్తున్నారని, ఉపాధి కూలీని రద్దు చేసే కుట్ర మోడీ ప్రభుత్వం చేస్తున్నారు అని అన్నారు. ఈ బడ్జెట్ లో 25 వేల కోట్లు తగ్గించడం దానిని రుజువు చేస్తున్నదని విమర్శించారు. అలాగే ఎలాంటి ఆక్షన్ లేకుండా నైపుణ్య లేని కూలీలకి వంద రోజుల పని విధానాన్ని తీసుకొచ్చిన ఈ చట్టం ఇప్పుడు అనేక ఆంక్షలుకు పెడుతున్నారని, చేసిన కూలీ పైసలు కూడా సంవత్సరాలుగా పెండింగ్ ఉంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నేడు నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి గానీ కూలీల బతుకులు మాత్రం అడుగంటి పోతున్నాయని అన్నారు. అందుకని 200 రోజులు పనిదినాలు పెంచుతూ... పనిచేసే ప్రతి ఒక్కరికి జాబ్ కార్డు ఇస్తూ రోజుకు 600 కూలీ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరాలు, మునిసిపాలిటీల పక్కన ఉన్న గ్రామాలని నగర, మున్సిపాలిటీలు అభివద్ధి పేరుతో పక్క గ్రామాలను ఆయా పట్టణాలలో కలిపి అక్కడి వారికి ఉపాధి పని లేకుండా చేశారని అన్నారు. 'గ్రామీణ ప్రాంతం నుంచి వలసలు వచ్చి బతుకుదెరువు కోసం పట్టణాలలో ఉన్న వారికి కూడా ఎలాంటి పని లేకుండా పోతుంది. అందుకోసం ఉపాధి హామీ చట్టాన్ని పట్టణ ప్రాంతంలో కూడా అమలు చేయాలని' డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాలు ఈనెల 23, 24 న నిజామాబాద్ లోని జనార్ధన్ గార్డెన్స్ లో నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా 23 న ఉదయం 10 గంటలకు ఉపాధి హామీ సమస్యల పైన సెమినార్ ఉంటుందని దీనికి పెద్ద సంఖ్యలో ప్రజల హాజరుకావాలని కోరారు.

పెద్ది వెంకట రాములు మాట్లాడుతూ...ఈనెల 23, 24 న జరిగే రాష్ట్ర కమిటీ సమావేశాల జయప్రదానికి మద్దతుగా ఆహ్వాన సంఘం కమిటీలో సంఘం నాయకులతో పాటు చీఫ్ పాట్రన్ గా -టి పి సి సి వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను నియమించుకున్నామని జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, వ్యాపారవేత్తలు, పల అనుభవం ఉన్న ప్రజాసంఘాల నాయకత్వాన్ని పెడుతూ కమిటీ వేసుకున్నామని, ఈ రాష్ట్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయాల్సిందిగా జిల్లా ప్రజలందరినీ, శ్రేయోభిలాషులని హదయపూర్వకంగా కోరుతున్నామని అన్నారు. అలాగే 23న జరిగే 10 గంటలకు జరిగే సెమినార్ కు అధిక సంఖ్యలో వ్యవసాయ వ్యవసాయ కూలీలు హాజరై జయప్రదం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు

సమస్యల సంత..

తీరని చింత

- వ్యాపారులకు తప్పని ఇబ్బందులు
- రూ.1.60 లక్షలు పలికిన సాలూర తైబజార్ వేలం

నవతెలంగాణ-బోధన్

పల్లెలల్లో జరిగే సంతలతోనే సందడిగా కళకళలాడుతాయి. కాని మేజర్ గ్రామ పంచాయతి, నూతన మండలంగా ఆవిర్భవించిన సాలూర మండలంలో సంవత్సరాల నుంచి సంత(అంగడి) సాగుతున్న సంతలో వ్యాపారుల సమస్యలు మాత్రం తీయడం లేదు. 2024-25 సంవత్సరానికి గాను సాలూర గ్రామ పంచాయతీలో నిర్వహించిన వేలంపాట విశ్వనాథ్ అనే వ్యక్తి రూ.1.60 లక్షలకు దక్కించుకున్నారు. వేలంలో కాంట్రాక్ట్ దక్కించుకున్న వ్యక్తి చిన్న వ్యాపారుల వద్ద 30, పెద్ద వ్యాపారుల వద్ద 50-80ల తైబజార్ వసూలు చేయడానికి గ్రామ పంచాయతీ వారు అనుమతించారు. గ్రామ పంచాయతీకి లక్షల రూపాయల ఆదాయం ఉన్న సంత(అంగడి)లో మాత్రం కనీస సౌకర్యాలయిన మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించడం లేదు. దాంతో మహిళ వ్యాపారులు మరుగుదొడ్లు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే వర్షాకాలంలో వర్షం కురిసినప్పుడు సంత బురదమయంగా మారిన పట్టించుకునే వారు ఉండరు. దాంతో వ్యాపారులు సమస్యలతోనే కూరగాయలు విక్రయించవలసిన పరిస్థితులు ఉన్నాయి.

సామూహిక మరుగుదొడ్ల కోసం ప్రతిపాదించాం

సంతలో వ్యాపారుల సౌకర్యార్థం సామూహిక మరుగుదొడ్ల కోసం గతంలో అధికారులకు విన్నవించాం. కాని అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదు. మరోసారి డీఆర్డీఏ అధికారులకు సమస్య వివరించి ప్రతిపాదన పంపుతాం. సంతలో సమస్యలు లేకుండా చర్యలు చేపడతాం.

ప్రవీణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి, సాలూర





కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన

ఆశిష్ సంగ్వాన్

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కలెక్టర్‌గా ఆశిష్ సంగ్వాన్ ఆదివారం పదవి భాధ్యతలు చేపట్టారు. అదనపు కలెక్టర్లు చంద్ర మోహన్, శ్రీనివాస్‌రెడ్డిలు పూల మొక్కలు ఇచ్చి కలెక్టర్‌కు ఘనస్వాగతం పలికారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వం 20 మంది జిల్లా కలెక్టర్లను బదిలీ చేసిన విషయం విదితమే. గత అక్టోబర్ నుంచి నిర్మల్ జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న సంగ్వాన్ కామారెడ్డి జిల్లాకు బదిలీకాగా ఆదివారం జిల్లా కలెక్టర్‌గా చార్జి తీసుకున్నారు. అనంతరం జిల్లాలో అమలు జరుగుతున్న కార్యక్రమాలను ధరణి, ధాన్యం సేకరణ, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల ప్రగతిని అదనపు కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుండే వచ్చే ప్రజావాణి ఫిర్యాదులపట్ల ప్రత్యేక శ్రద్ధతో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలన్నారు. ఆర్డీఓ రంగనాథ రావు, గిరిజన అభివద్ధి అధికారి అంబాజీ, ఎస్సి అభివద్ధి అధికారి రంజిత, డీఈఓ రాజు, డిపిఆర్ఓ శాంతికుమార్, తహసీల్దార్ జనార్ధన్, కలెక్టరేట్ ఎఓ మసూర్ అహ్మద్, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది, తదితరులు కలెక్టర్‌కు పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

కార్మిక హక్కుల కోసం సంఘటిత పోరాటాలు

- సిద్ధం కావాలని సీఐటీయూ పిలుపు

నవతెలంగాణ-బోధన్

కార్మిక హక్కుల కోసం సంఘటిత పోరాటాలకు కార్మికులు సిద్ధం కావాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం బోధన్ పట్టణంలోని విద్యాధికారి జూనియర్ కళాశాలలో నిర్వహించిన రెండు రోజుల శిక్షణ తరగతులలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడారు. నాయకులు కార్మికులు ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై సంఘటిత పోరాటాలు నిర్వహించి తమ హక్కులకై నిలబెట్టినప్పుడు మాత్రమే సమస్యలు పరిష్కరించబడతాయని అందుకు కార్యకర్తలందరూ కార్మిక వర్గాన్ని సన్నద్ధం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడంతో పాటు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత మౌలిక సదుపాయాల అమలు జరపటంలో ప్రభుత్వాలు యాజమాన్యాలు నిర్లక్ష్యం వహించటం వలన కార్మిక వర్గం కనీస భద్రత లేకుండా హక్కులు హరించబడుతున్నాయని అన్నారు. పెరుగుతున్న ధరలను కార్మిక వర్గం భరించలేక ఆర్థిక సమస్యలతో కార్మిక కుటుంబాలు ఆకలితో అలమటించే పరిస్థితులు ఉన్నాయని అన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సంఘటిత పోరాటాలు తప్ప మరొక మార్గం లేదని పేర్కొన్నారు. కార్మికులు ఏవిధంగా దోపిడీకి గురవుతున్నారో సిఐటియు రాష్ట్ర నాయకులు ఎండి అబ్బాస్ వివరించారు. కార్మిక ఉద్యమ చరిత్రను రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు వివరించారు. అనంతరం సిఐటియు నిర్మాణంపైన సిఐటియు విశిష్టతను రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్వి రమ వివరించారు. సిఐటియు జిల్లా నాయకులు ఏ. రమేష్ బాబు శిక్షణ తరగతులను పర్యవేక్షించారు. తరగతుల్లో నాయకులు జంగం గంగాధర్, నన్నే సాబ్, సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

విరాళం అందజేత



విరాళం అందజేస్తున్న మాజీ ఉపసర్పంచ్

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ మాజీ ఉప సర్పంచ్ బ్రహ్మదండి సువర్ణ-లింగం దంపతులు అమ్మవారి ఆలయ నిర్మాణం కోసం తనవంతు ప్రయత్నంగా రూ.11,116 ఆయన నివాసంలో ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్టు సభ్యులు విరాళం అందజేసిన మాజీ ఉప సర్పంచ్ దంపతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మరి కొంతమంది దాతలు ఆలయ అభివృద్ధి కోసం ముందుకు రావాలని కమిటీ సభ్యులు కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎర్రోళ్ల విజయ్, కంచు గంగాధర్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు..

మామిడిపల్లిలో ఘనంగా ఊర పండగ



బోనాలతో గుడికి వచ్చిన గ్రామస్తులు

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం "ఊర పండుగ" నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన వీధుల గుండా డప్పు వాయిద్యాలు, భాజా బజంత్రీలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించారు. సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు బాగా పండాలని అందరూ బాగుండాలని గ్రామదేవతలను కోరుకున్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు, వివిధ కుల సంఘాల సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న స్నేహితులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్‌లో ఆదివారం గ్రామానికి చెందిన స్నేహితులంతా కలిసి ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. గ్రామానికి చెందిన పలువురు ఉప్లూర్ ఫ్రెండ్స్ పేరుతో వాట్సప్ గ్రూపును నిర్వహించుకుంటున్నారు. ఈ గ్రూపులో గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగులు, ప్రస్తుతం ఉద్యోగాలు చేస్తున్న వారు, వ్యాపారస్తులు, ఇతరత్రా పనులు కొనసాగిస్తున్న వారంతా కలిసి సుమారు 200 మంది వరకు సభ్యులు ఉన్నారు. ఎక్కడెక్కడో స్థిర పడ్డ వారంతా కలిసి ఒకచోట కలుసుకోవాలన్న ఆలోచనతో ఆదివారం గ్రామంలో ఆత్మీయ సమ్మేళనం పేరుతో ఒకచోట కలిశారు. దశాబ్దాల తర్వాత ఒకరినొకరు కలుసుకోవడం పట్ల కొందరు భావోద్వేగానికి లోనయ్యారు. ఒకరినొకరు తమ తమ జీవిత అనుభవాలను పంచుకోవడం ద్వారా ఆత్మీయ అనుబంధాన్ని నెమరు వేసుకున్నారు. గ్రామానికి చెందిన ఎందరో దశాబ్దాలుగా ఒకరికొకరు కలుసుకోకుండా ఉన్న వారంతా ఉప్లూర్ ఫ్రెండ్స్ వాట్సాప్ గ్రూప్ పేరుతో ఒక చోట చేరడం పట్ల వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఒకరి అనుభవాలను ఒకరు పంచుకొని, కష్టనష్టాలను కుటుంబ స్థితులను ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. అంతా కలిసి ఒకచోట చేరి గ్రూప్ ఫోటోలు దిగారు. అనంతరం సామూహిక భోజనాలు చేశారు. తరచూ ఇలాంటి సమ్మేళనం ఏర్పాటు చేసుకోవడం ద్వారా గ్రామస్తులతో ఆత్మీయ అనుబంధాన్ని కొనసాగించేందుకు ఆస్కారం ఉంటుందని సందర్భంగా పలువురు వ్యాఖ్యానించారు.

వినియోగదారుల సంక్షేమం కోసం కృషి అభినందనీయం



దామోదర్‌ను కలిసిన పలువురు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మందుల నాణ్యతపై వినియోగదారుల సంక్షేమం కోసం పల్లె పాడు దామోదర్ అమెరికాకు వెళ్లడం హర్షణీయమని ప్రధాన కార్యదర్శి సందు ప్రవీణ్ తెలిపారు. దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడు డాక్టర్ పల్లె పాడు దామోదర్ అమెరికాలోని రిచ్మండ్, డల్లాస్ ప్రాంతాల విదేశీ పర్యటనకు వెళ్తున్న సందర్భంగా ఆయనకు నిజామాబాద్ వినియోగ దారుల సంక్షేమ సమితి అధ్యక్షుడు పెందోట అనిల్ కుమార్, ఉపాధ్యక్షుడు వి.యన్.వర్మ, ప్రధాన కార్యదర్శి సందు ప్రవీణ్, సంయుక్త కార్యదర్శులు మహాదేవుని శ్రీనివాస్, గైని రత్నాకర్, కొనతల సాయిరెడ్డి, బానోతు సందీప్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అమెరికాలోని డల్లాస్, రిచ్మండ్‌లలో పల్లె పాడు దామోదర్ పలు సంక్షేమ కార్యక్రమాలకు హాజరు కావడంతో పాటు, ముఖ్యంగా వినియోగదారుల వ్యవహారాలకు సంబంధించి, యూ ఎస్ - ఎఫ్‌డీఏ అధికారులను ఆయన కలువనున్నారు. యూఎస్ - ఎఫ్‌డీఏ ఔషధాల నాణ్యతపై అంతర్జాతీయ స్థాయిలో పలు దేశాలకు సూచనలు అందించే కార్యక్రమంలో పాల్గొనడం అభినందనీయమని అన్నారు.

సంబురంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

నవతెలంగాణ-ఆర్మూర్

మన చిన్ననాటి బడి స్నేహితులని మళ్లీ కలుద్దాం అంటూ ఆనాటి జ్ఞాపకాల కోసం ఆదివారం పట్టణంలోని మైత్రి గార్డెన్ లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. 1996..97 సంవత్సరం 10వ తరగతి చదివిన విద్యార్థులు చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకొని విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువా, పూలమాల లతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామ్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, నీరజ్, నారాయణరెడ్డి, పూర్వ విద్యార్థులు బంటు మహిపాల్, సాగర్, సంతోష్, రమేష్, కత్రాజీ శ్రీనివాస్ సాయందర్, మహిపాల్, మోహన్, రియాజ్, చిన్న నరసింహులు, నర్సారెడ్డి, సికిందర్,, ప్రవేదర్, కిరణ్, హేమలత, ప్రవీణ, ప్రదీప, అలవేణి, వినోద, విజయలక్ష్మి, విజయ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పాలెపు రాజును పరామర్శించిన కోటపాటి

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ లో బిజెపి అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు తండ్రి పాలెపు చిన్నారెడ్డి అనారోగ్యంతో మరణించారు. ఆదివారం బిజెపి సీనియర్ నాయకులు కోటపాటి నరసింహం నాయుడు, బద్దం లింగారెడ్డి పాలెపు రాజు ఇంటికి వెళ్లి తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. పాలెపు చిన్నారెడ్డికి నివాళ్లు అర్పించారు.



ఉత్తమ బోధన @ ప్రభుత్వ పాఠశాలలు

- సైన్స్‌ఫెయిర్, ప్రేరణ పోటీలు
- ఉన్నతస్థాయికి చేరుతున్న సర్కారు పాఠశాల విద్యార్థులు



పార్థసారధి



ప్రభుత్వ పాఠశాల

నవతెలంగాణ-ఆర్మూర్

నేడు ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ విద్యా బోధన అందిస్తూ ఎందరినో ఉన్నత స్థాయికి తీర్చిదిద్దుతున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు. సాధారణ ఉపాధ్యాయుడు పాఠాల్ని బోధిస్తాడు. మంచి ఉపాధ్యాయుడు వాటిని వివరిస్తాడు ఉత్తమ ఉపాధ్యాయుడు విశదీకరిస్తాడు. గొప్ప ఉపాధ్యాయుడు స్ఫూర్తి అందిస్తాడు. ఈ మాటల్లో ఎంతో వాస్తవం ఉంది. గురువుల బోధనలోనే విద్యార్థులు ప్రపంచాన్ని తెలుసుకుంటారు. ఉన్నత వ్యక్తులుగా ఎదుగుతారు. ఈ ప్రపంచంలో ఏ వ్యక్తికైనా తొలి గురువు అమ్మే. అయినప్పటికీ ప్రతి ఒక్కరికి తమ జీవితంలో స్ఫూర్తి నింపి దిశ నిర్దేశం చేసిన గురు వంటు ఒకరుంటారు. వారందరూ ఆజన్మాంతం స్మరణీయులు.

పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల..

పట్టణంలోని అంగడి బజార్ దగ్గర గల బాలుర ఉన్నత పాఠశాల యందు చదివిన వారు ఎందరో ఉన్నత స్థాయికి ఎదిగారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాబోధన చేస్తూ విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికై కృషి చేస్తూ, ఎస్ఎస్‌సి, సైన్స్ ఫెయిర్, ప్రేరణ లాంటి జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలలో విద్యార్థులు పాల్గొని విజయం సాధించేలా కృషి చేయడం పాఠశాల ప్రత్యేకత. 2023..24 సంవత్సరానికి పదవ తరగతి ఫలితాలలో అత్యధిక ఉత్తీర్ణత సాధించింది. గత ప్రధానో ఉపాధ్యాయులు హరిత, కవిత, ప్రస్తుత లక్ష్మీ నరసయ్య విద్యార్థుల అభ్యున్నతికి నిర్విరామ కృషి చేస్తున్నారు. మండలంలోని పలు పాఠశాలల్లోని ఉపాధ్యాయులు సైతం విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి పురస్కారానికి ఎంపికైన బాలుర పాఠశాల..

కేంద్ర విద్యా శాఖ ఆధ్వర్యంలో 2021 22 సంవత్సరానికి నిర్వహించిన రాష్ట్రస్థాయి స్వచ్ఛ విద్యాలయ పురస్కారానికి జడ్పీ బలుర ఉన్నత పాఠశాల ఎంపికైంది. ఈ పోటీల్లో రాష్ట్రస్థాయిలో 91వ శాతంతో రెండు ర్యాంకు పొందింది. జిల్లా నుంచి ఎంపికైన ఏకైక పాఠశాలగా గుర్తింపు సాధించింది. నీరు, మరుగుదొడ్లు, పరిశుభ్రత. పాఠశాల నిర్వహణ, భవనం తదితర అన్ని అంశాలపై రాష్ట్ర బృందం పర్యటించి ఈ పురస్కారానికి ఎంపిక చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 20 పాఠశాలలకు ర్యాంకులను ప్రకటించిగా రెండో ర్యాంకు సాధించింది.

పట్టణ పూర్వ విద్యార్థి.. నేడు రాష్ట్ర ఎన్నికల కమిషనర్..

ప్రస్తుత రాష్ట్ర ఎన్నికల కమిషనర్ చిట్ల పార్థసారథి బాలుర ఉన్నత పాఠశాలలోనే చదివారు. ప్రభుత్వ పాఠశాలల్లో అరకొర వసతుల మధ్య ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగారాయన. అడ్డంకులను దాటుకుంటూ ఉన్నత స్థాయి విజయాలను సాధించారు. డాక్టర్ కావాలనుకుని ఇంటర్ తర్వాత మెడిసిన్ ఎంట్రెన్స్ కోసం హైదరాబాద్ వెళ్లి మెడిసిన్ కళ నెరవేరకపోవడంతో ఉన్నతమైన ఉద్యోగాన్ని సాధించాలన్న కసిని అప్పుడే పెంచుకున్నారు. ఇంటర్ వరకు తెలుగు మీడియం చదివి బీఎస్సీ అగ్రికల్చర్ ఆంగ్ల భాషపై పట్టు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచారు. గ్రూపు వన్ ఇంటర్వ్యూకు ఎంపికై ఆర్డీవోగా, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ గా డిఆర్‌ఓగా పని చేసినారు. 1993 బ్యాచ్ ఐఏఎస్ అధికారిగా ఎంపికై సంయుక్త కలెక్టర్‌గా, మార్క్‌ఫెడ్ ఎండిగా, రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్‌గా, తెలంగాణ ఏర్పాటు తర్వాత పౌరసరఫరాల శాఖ కార్యదర్శిగా పనిచేసే ప్రస్తుతం రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా కొనసాగుతున్నారు.పుట్టిన ఊరికి చదువు చెప్పిన బడికి ఏదైనా చేయాలనే సంకల్పంతో తన తండ్రి పేరిట చిట్ల జీవన్ రాజ్ మెమోరియల్ ట్రస్టును ఏర్పాటు చేసి తాను చదివిన పాఠశాల లోనే విద్యార్థులతో స్ఫూర్తి నింపే కార్యక్రమాలు చేయడం అభినందనీయం.

ప్రతి విద్యార్థిని ఉత్తమ పౌరుడిగా తయారు చేయాలి..



ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థిని ఉత్తమ పౌరుడిగా తీర్చిదిద్దాలనేదే నా ఆలోచన. ప్రతి ఉపాధ్యాయుడు తమ తరగతిలోని ప్రతి ఒక్కరిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి అలా వారిని ఉత్తమ పౌరులుగా తయారు చేయడం కోసం పని చేస్తాను. ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుకు తపిస్తుండడం అభినందనీయం.. విద్యార్థులలో నమ్మకాన్ని నింపుతూ మంచి విద్యను అందిస్తున్నాం.

లక్ష్మీ నరసయ్య,, ప్రధానో ఉపాధ్యాయులు, బాలుర ఉన్నత పాఠశాల, ఆర్మూర్.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే జైలుకే

- మందు బాబులకు అలర్ట్
- తెలంగాణ పోలీస్



ప్రైవేట్ ప్లేస్‌లలో తాగుతున్న మందుబాబులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మందుబాబులకు బిగ్ అలర్ట్. అయితే బహిరంగ ప్రదేశాల్లో మందు తాగుతున్నారా. అయితే ఇకపై మీరు జైలుకు వెళ్లాల్సిందే. విధులు మగించుకుని ఇంటికి వెళా _నో.. స్నేహితులతో సరదాగా మందు తాగుదామని అనుకు ంటున్నారా.. అయితే జరజాగ్రత్త. ఇంట్లోనే లేదా బార్‌లోనే కూర్చుని మద్యం సేవించండి. అలాకాదని బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతూ పోలీసుల కంట పడ్డారో ఇక అంతే సంగతి. మీకు ఆరు నెలల జైలుశిక్ష తప్పదు. బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం నేరమంటూ హెచ్చరిస్తూ పోలీసు శాఖ తమ అధికారిక ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది.

'బహిరంగ మద్యపానం చట్టరీత్యా నేరం. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం ప్రజలకు, స్థానికులకు ఇబ్బంది కలిగిస్తుంది. ఇలా రోడ్లపై కానీ, ఖాళీ ప్రదేశాల్లో కానీ మద్యం సేవించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఈ నేరానికి 6 నెలల వరకు జైలు శిక్ష పడుతుంది' అంటూ ట్వీట్ చేసింది. ఇలాంటి ఘటనలపై డయల్ 100కు ఫోన్ చేయాలని ప్రజలకు సూచించింది.

అన్నాభావు సాఠే ఆశయాల కోసం ఉద్యమించాలి



మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

కార్మికోద్యమ నాయకులు అన్నాభావు సాఠే ఆశయాల కోసం ఉద్యమించాలి అని బహుజన లెఫ్ట్ పార్టీ-బిఎల్ పి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్ పిలుపునిచ్చారు. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ నాయకులు, కార్మిక ఉద్యమ నాయకులు, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచన విధానాలను ప్రచారం చేసిన మహోన్నత వ్యక్తి అన్నాభావు సాఠే అని అన్నారు. ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని చంద్రశేఖర్ కాలనీ బైపాస్ పార్క్ వద్ద అన్నాభావు సాఠే స్మారక చిహ్నం జెండా ఆవిష్కరించారు. అనంతరం దండి వెంకట్ మాట్లాడుతూ చరిత్రలో ఉత్పత్తి జాతులైన బహుజన చరిత్రకారుల చరిత్ర మరుగున పడిపోతున్న నేపథ్యంలో ఆయా బహుజన శ్రామిక కులాల విద్యావంతులు చరిత్రను అధ్యయనం చేయాలని సూచించారు. ఆగస్టు 31న అన్నాభావు సాఠే జయంతి వరుకు జిల్లా కేంద్రంలో ఆ మహనీయుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బహుజన లెఫ్ట్ మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ సబ్బని లత, బిడిఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ జి. శ్రీమాన్, అన్నాభావు సాఠే మాదిగ సంఘం జిల్లా, పట్టణ కమిటి నాయకులు సాయి కాంబ్లే, గంగాధర్ గాయక్వాడ్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కొలతల్లో, లెక్కల్లో తేడాలు..

- నాగపూర్‌లో సామాజిక తనిఖీ గ్రామసభ



గ్రామ సభ నిర్వహిస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని నాగపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆదివారం 2023-24 ఆర్థిక సంవత్సరంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామంలో జరిగిన వివిధ పనులపై సామాజిక తనిఖీ గ్రామ సభను నిర్వహించారు. గ్రామ సభలో డిఆర్పీ నవీన్ గ్రామంలో జరిగిన ఉపాధి హామీ పనుల వివరాలను చదివి వినిపించారు. సామాజిక తనిఖీ బృందం సభ్యులు తమ పరిశీలనలో గుర్తించిన అంశాలను సభలో వివరించారు. అనంతరం ఉపాధి హామీ పథకంలో చేపట్టిన అన్ని పనులపై చర్చించారు. కూలీలు చేసిన పనుల్లో పలుచోట్ల కొలతలు తేడా ఉన్నట్లు సామాజిక తనిఖీ బృందం సభ్యులు గుర్తించారు. కొలతల్లో తేడా ఉన్న పనులను మళ్లీ చేయించాలని ఉపాధి సిబ్బందికి అధికారులు సూచించారు. ఉపాధి హామీ పనులకు కూలీలు హాజరైన సంతకాలు తీసుకోకపోవడం పట్ల సిబ్బందిపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో జరిగిన ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ గ్రామ సభలో అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్, ఈజీఎస్ ఏపీవో విద్యానంద్, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు అజ్మత్ హుస్సేన్, పంచాయతీ కార్యదర్శి సంధ్య, ఫీల్డ్ అసిస్టెంట్, ఆశా కార్యకర్తలు, వీఆర్పీలు, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానంలో ఆదర్శంగా నిలవాలి

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీలో అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం రెండు గంటలు అనే నినాదంతో నిర్వహిస్తున్న స్వచ్ఛ కాలనీ సమైక్య కాలనీ కార్యక్రమం ఆదివారంతో 50వ వారానికి చేరింది. కాలనీ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు, కాలనీవాసులు. కాలనీలోని ప్రధాన రహదారికి ఇరువైపులా అడ్డదిడ్డంగా పెరిగిన చెట్ల కొమ్మలను, పిచ్చి మొక్కలను కట్టర్లతో కత్తిరించారు. రోడ్డు పక్కన ఉన్న మురుగు కాలువలలో వ్యర్థాలు చేరి మురుగు నీరు నిలిచి దుర్గంధం వస్తుండడం పారలు, కర్రల సాయంతో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న వ్యర్థాలను తొలగించారు. మురుగు కాలువలను శుభ్రం చేశారు. రోడ్డుపై ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించి పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గోసికొండ అశోక్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమాన్ని ఇలాగే కొనసాగించి జిల్లాకు, రాష్ట్రానికి ఆదర్శనంగా నిలుస్తామని పేర్కొన్నారు. హనుమాన్ ఆలయ కమిటీ అధ్యక్షుడు పుప్పాల శివరాజ్ కుమార్ మాట్లాడుతూ జర్నలిస్ట్ కాలనీని, హనుమాన్ ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు.

కార్యక్రమంలో కోశాధికారి సత్యనారాయణ గౌడ్, ఉపాధ్యక్షులు సుంకే శ్రీనివాస్, కొక్కెర భూమన్న, కార్యదర్శి ఎల్.సాయన్న, ఎస్సారెస్పీ డిప్యూటీ ఈఈ గణేష్, ఎర్ర భూమయ్య, ఎల్టీ కుమార్, భాజన్న, కాంగ్రెస్ నాయకుడు ఎస్.కె.బబ్లు, మాస్టర్ కృషివర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పిరమిడ్ నిర్మాణానికి విరాళం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని సిద్దులగుట్ట నందు నిర్మిస్తున్న తెలంగాణ రాష్ట్రంలో అతిపెద్ద రెండో పిరమిడ్ శ్రీ నవనాథ సిద్దేశ్వర పిరమిడ్ ధ్యాన మహా శక్తి క్షేత్రంలో మార్బుల్స్ కొరకు 5లక్షల రూపాయలు విరాళాన్ని మామిడిపల్లికి చెందిన బొడ్డు భారతేంద్ర(అమెరికా) అందజేశారని పిఎస్ఎస్ఎమ్ జిల్లా అధ్యక్షులు అడ్వకేట్ సాయి కృష్ణారెడ్డి, చైర్మన్ ఏనుగు తిరుమల గంగారం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆర్మూర్ రోటరీ క్లబ్‌కు అవార్డుల పంట



అవార్డును అందుకుంటున్న రోటరీ క్లబ్ సభ్యులు

నవతెలంగాణ-ఆర్మూర్

రోటరీ క్లబ్ ఆఫ్ భద్రాచలం వారు నిర్వహించిన కాన్ఫరెన్స్ అవార్డుల మహోత్సవం శంకరాభరణం కార్యక్రమం ఆదివారం భద్రాచలంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో ఉన్న అన్ని రోటరీ క్లబ్స్ సభ్యులు హాజరయ్యారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులలో ఉత్తమ అధ్యక్షులుగా పట్వారి గోపికృష్ణ ఫస్ట్ ప్రైజ్, కార్యదర్శులలో పట్వారీ తులసి సెకండ్ ప్రైజ్, ఆర్మూర్లో చేసిన పర్యావరణం, ఆరోగ్య శిబిరాలు, సామాజిక రంగం, విద్యారంగం ఇలా వివిధ అంశాలపై చేసిన కృషికి ఉత్తమ అవార్డ్స్ ముఖ్య అతిథి డిస్ట్రిక్ట్ గవర్నర్ బుషిరెడ్డి శంకర్ రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు పట్వారి గోపికృష్ణ మాట్లాడుతూ.. సేవలను గుర్తించినందుకు ధన్యవాదాలు తెలిపారు. సహకరించిన రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ సభ్యులు అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు. కార్యక్రమంలో రోటరీ మాజీ అధ్యక్షులు ప్రవీణ్ పవార్, నిజామాబాద్ జిల్లా అసిస్టెంట్ గవర్నర్ శ్రీనివాస్, రోటరీ క్లబ్ జేమ్స్ నిజామాబాద్ అధ్యక్షులు విజయ్ కాంత్, తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్‌లో బోనాల పండుగ

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని సిర్పూర్ గ్రామంలో ఆదివారం బోనాల పండుగను గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. బోనాలతో ఊరేగింపుగా వెళ్లి గ్రామదేవలకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ సొసైటీ వైస్ చైర్మన్ సుమన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బోనాలతో వస్తున్న గ్రామస్తులు

మున్సిపల్ ఆధ్వర్యంలో క్రికెట్ లీగ్

నవతెలంగాణ-కామారెడ్డి

పట్టణంలోని మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ ఆదేశాల మేరకు మున్సిపల్ ఆధ్వర్యంలో క్రికెట్ లీగ్ ఆదివారం నిర్వహించారు. ఈ క్రికెట్ లీగ్‌లో గెలుపొందిన వారికి గడ్డం ఇందుప్రియ, వైస్ చైర్‌పర్సన్ ఊర్దుండ వనిత, శుభాకాంక్షలు తెలియజేశారు. ఇందుప్రియ మాట్లాడుతూ.. గెలుపు ఓటమి సహజం అన్నారు. ఈ క్రికెట్ లీగ్‌లో మొదటి విన్నర్గా గెలుపొందిన రెవెన్యూ టీం, రెండవ బహుమతి మున్సిపాల్ ఇంజనీరింగ్, టీంకి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కామారెడ్డి పట్టణ కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



గెలుపొందిన రెవెన్యూ టీం

ఈద్గా ముస్తాబు

నవతెలంగాణ-లింగంపేట్

బక్రీద్ పండుగ పురస్కరించుకొని లింగంపేట్ మండల కేంద్రంలోని పెద్దవాగు సమీపంలో గల ఈద్గ వద్ద ప్రార్థనల కోసం ఏర్పాట్లు చేసినట్టు లింగంపేట్ గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రావణ్ కుమార్ ఆదివారం తెలిపారు. నమాజ్ చేసే ప్రాంతంలో చెత్తచెదారం తొలగించినట్టు తెలిపారు.



ప్రార్థనల కోసం ఈద్గాను శుభ్రం చేసిన సిబ్బంది

ఒకే అధికారి.. అనేక విధులు

- ఒక మండలానికి ఎంఈవో.. మరో మూడు మండలాలకు ఇన్‌చార్జి
- మూడు గ్రామాలకు ప్రత్యేకాధికారి
- ఎక్కడ ఎప్పుడు ఉంటారో తెలియని దుస్థితి
- కుంటుపడుతున్న విద్య, పంచాయతీపాలన

నవతెలంగాణ-మద్నూర్

ఒక అధికారి తన వృత్తికి న్యాయం చేసేందుకు అందుకు తగ్గట్టు విధులు కేటాయించాల్సి ఉంటుంది. కానీ అందుకు విరుద్ధంగా ఇతర బాధ్యతలు అప్పగిస్తుండటంతో అసలు బాధ్యతలు, అప్పగించిన బాధ్యతలు చేపట్టలేక సతమవుతున్నారు. దీన్ని ఆసరగా చేసుకొని కొందరు అధికారులు అయితే ఎక్కడ ఉంటారో తెలియని దుస్థితి నెలకొంది.

మద్నూర్ మండల విద్యాశాఖ అధికారిగా ఉన్న రాములు నాయక్ మద్నూర్ మండలంతో పాటు బిచ్కుంద, జుక్కల్, డోంగ్లి తదితర మండలాలకు మండల విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు కొనసాగిస్తున్నా రు. నాలుగు మండలాలకు విద్యాశాఖ అధికారి కాకుండా మద్నూర్ మండలంలోని లచ్చన్, రుసేగావ్, సుల్తాన్‌పేట్, ఈ మూడు గ్రామాలకు గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు ఉన్నాయి. ఈ అధికారి అటు విద్య బోధనాల పట్ల ఇటు గ్రామాలలో ప్రజా సమస్యల పట్ల బాధ్యతలు నిర్వర్తించాలంటే ఆ అధికారికి ఏది చూసినా చూడకపోయి నా అడిగే వారే లేరు అనే విధంగా నెలకొంది. ఈ అధికారి ఇటు నాలుగు మండల విద్యాశాఖ అధికారిగా అటు మూడు గ్రామాలకు ప్రత్యేక అధికారిగా బాధ్యతలు ఉండడం ఆయన ఏ రకంగా తన బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించడా నికి మండలంలోని ఖరగ్ గ్రామ ప్రాథమిక పాఠశాల తెరవకపోవడమే నిదర్శనంగా చెప్పవచ్చు.



గత ఏడాది ఖరగ్ పాఠశాల మూడు నెలలు తెరవకుండా మూతపడే ఉంటే ఆ పాఠశాల పట్ల మండల విద్యాధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న రాములు నాయక్ ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపణలు వ్యక్తమ య్యాయి. ఈ ఏడాది కూడా ఆ గ్రామ ప్రాథమిక పాఠశాల చేర్చుకోలేకపోతున్నప్పటికీ పాఠశాల చదువుల పట్ల ఏమాత్రం పట్టించుకోవడం లేదు అనడానికి శనివారం నవతెలంగాణకు తెలిపిన సమాధానమే ఆయన బాధ్యతలు ఎలా కొనసాగుతున్నాయో ప్రభుత్వం అర్థం చేసుకోవలసిన అవసరం ఉంది. ఈ ఏడాది కూడా కరగ్ పాఠశాల తెరుచుకోలేక పోవడానికి కారణాలు మండల విద్యాశాఖ విద్య పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నాదనే ఆరోపణలు ప్రజల్లో వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల లచ్చన్ గ్రామంలో మురికి కాల్వలు తీయక కంపు కొడుతున్న వాటి గురించి గ్రామస్తులు వాట్సాప్‌లో ఫోటోలు పెడుతూ ఆవేదన వ్యక్తం చేసిన దానిని పత్రికల్లో వచ్చిన వార్తలను చూస్తే ఈ అధికారి ప్రత్యేక అధికారిగా ఉంటూ ఎటు బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించలేకపోతున్నారనే ఆరోపణలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం ఇలాంటి అధికారులకు కొన్ని బాధ్యతలు తగ్గించి మండలంలో విద్యాబోధన కుంటు పడకుండా అలాగే ప్రజలకు న్యాయం చేకూరటానికి విధులు సక్రమంగా నిర్వర్తించే విధంగా చర్యలు చేపట్టవలసిన అవసరం ఎంతైనా ఉందని మండల ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

సొంతింటి కల సాకారం చేస్తాం

- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు

నవతెలంగాణ-మద్నూర్

అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పేదల సొంతింటి కల సహకారానికి సన్నద్ధం అవుతున్నట్లు జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతి సంవత్సరం అర్హులైన పేదలు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించేందుకు నాలుగున్నర లక్షలు మంజూరు చేస్తూ కావలసిన నిధులు కేటాయించిందని, 4.30 లక్షల ఇళ్ల నిర్మాణానికి 7700 కోట్లు అవసరమని ప్రతి నియోజకవర్గంలో ప్రతి సంవత్సరం 3500 చొప్పున ఇండ్ల నిర్మాణం చేపట్టనున్నట్టు తెలిపారు. ఐదు సంవత్సరాల కాలంలో పేదలకు 22 లక్షల 50, వేలు ఇండ్లు నిర్మించడానికి ప్రభుత్వం కార్యాచరణతో ముందుకెళ్తుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పేదల కోసమే పనిచేస్తుందని సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం సన్నద్ధం అవుతుందని తెలిపారు. సొంత ఇంటి కోసం పేదలు అందజేసిన దరఖాస్తులను పరిశీలన కోసం కార్యాచరణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఒక్కచోట చేరిన 1997-98 బ్యాచ్ విద్యార్థులు

నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలోని ఎస్అర్ కార్డాన్ పంక్షన్‌హల్‌లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1997-98 సంవత్సరం చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒక్కరిని ఒక్కరూ ఆత్మీయంగా పలకరించుకున్నారు. అధ్యాపకులకు సన్మానం చేశారు. పాఠశాలలోని తీపి జ్ఞాపకాలు గుర్తుకు చేసుకున్నారు. యదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో, ఆనాటి మధురానుభూతులను పొందుతూ ఉల్లాసంగా గడిపారు.

తొలకరి 'నష్టం'

- విత్తుకున్నా.. మొలకెత్తని విత్తనాలు
- పెట్టుబడులు నష్టపోతున్నట్టు రైతుల ఆవేదన



విత్తనాలు విత్తుకున్న వ్యవసాయ క్షేత్రం

నవతెలంగాణ-జుక్కల్

ఇటీవల తొలకరి పలకరించడంతో రైతులు విత్తనాలు విఉత్తకోగా.. తర్వాత వరుణుడుమొఖం చాటేయడంతో వారు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వర్షాలు పడటం లేదని విత్తనాలు మెలకెత్తడం కష్టంగా ఉందని వాపోతున్నారు. జుక్కల్ మండలంలో 39 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతుంటాయి. కూరగాయలు, పండ్ల తోటలు, ఖరీఫ్ లో సోయా, పెసర, మినుము, పత్తి, కందులతో పాటు ఖరీప్ పంటలు అనవాయితిగా పండిస్తువస్తున్నారు మండల రైతులు. ఇటివలే జుక్కల్ మండలంలో మూడూ రోజుల క్రితం వర్షం పడటంతో రైతులు అదరబాదరగా తొందర పాటు పడి ఖరీదైన ఎరువులు , విత్తనాలు కొనుగోలు చేసి విత్తేశారు. ప్రస్తుతం విత్తిన నాటి నుండి నేటి వరకు వర్షాలు పడక పోవడంతో పెట్టుబడి నష్టం వాటిల్లే ప్రమాదం చోటు చేసుకుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

ప్రత్యేక అధికారుల పాలనలో
పడకేసిన పారిశుధ్యం

- జీపీ కార్మికులకు అందని వేతనం
- అప్పులు చేస్తూ పనులు చేపడుతున్న కార్యదర్శులు

నవతెలంగాణ-రెంజల్

గ్రామాల్లో సర్పంచ్‌ల పాలన ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారులకు బాధ్యతలు అప్పగించాగా పారిశుధ్య లోపం తారస్థాయికి చేరుకుంది. గ్రామపంచాయతీలలో నిధుల లేమి, పారిశుధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం వెరసి.. గ్రామాల్లో చెత్తచెదారం పేరుకుపోతోంది. గ్రామపంచాయతీ కార్యదర్శులు గ్రామాల అభివృద్ధి కోసం అప్పులు చేసి నెట్టుకు రావాల్సిన దుస్థితి నెలకొంది. లక్షలాది రూపాయలను అప్పులు చేసినా గ్రామాల అభివృద్ధికి తీవ్ర లోపం జరుగుతోంది. అప్పులు చేసి గ్రామంలో తాగునీరు, వీధి దీపాల ఏర్పాటు, సరిపోతుందని, గత నాలుగు ఐదు నెలలుగా కార్మికులకు వేతనాలు ఇవ్వకపోవడంతో పలు గ్రామాలలో పారిశుధ్య కార్మికులు పనులను నిలిపివేయడంతో గ్రామాలు పారిశుధ్యంతో నిండిపోయాయి. ప్రత్యేక అధికారులు మాత్రం ఇలాగైనా గ్రామ కార్యదర్శి లే బాధ్యత వహిస్తూ, పనులను పూర్తి చేయాలని ఆదేశాలు ఇవ్వడంతో గ్రామ కార్యదర్శిల పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా తయారైంది. పక్క మండలాల నుంచి కార్మికులను తీసుకువచ్చి పారిశుధ్య కార్మికులను చేపట్టడానికి ప్రయత్నిస్తున్న కార్యదర్శులకు పారిశుధ్య కార్మికులు అడ్డుపడడంతో ఏమి చేయలేని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రతి గ్రామపంచాయతీకి ప్రత్యేక నిధులు కేటాయించి పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిని సాధించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల పేరుతో పాఠశాలల మరమ్మతుల విషయంలో అధికారులు నిమగ్నం కాగా, పారిశుధ్య లోపం స్పష్టంగా కనబడు తుంది. గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం, స్థానిక ప్రజా ప్రతినిధులు, జిల్లా, మండల అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



సాటాపూర్‌లో లోపించిన పారిశుధ్యం



రెంజల్‌లో పందుల స్వైర విహారం



సాటాపూర్‌లో పేరుకుపోయిన చెత్త



రెంజల్‌లో డ్రయినేజీలో చెత్తాచెదారంతో నిలిచిన మురుగు

యువతకు క్రికెట్ కిట్టు అందజేత

నవతెలంగాణ-రెంజల్

మండలం నీల గ్రామంలోని యువతకు మండల ఉపాధ్యక్షులు జాతర యోగేష్ క్రికెట్ కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి యువత చదువుతోపాటు, క్రీడల్లో రాణించినట్లయితే, మానసికంగా శారీరకంగా ధృఢంగా మారే అవకాశం ఉందని, దీని దృష్టిలో పెట్టుకొని యువతకు క్రికెట్ గెట్టిను అందజేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు బండారు రవి, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు బండారు పోశెట్టి, అనిల్, రమేష్, లక్ష్మణ్ స్థానిక యువత, తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత

నవతెలంగాణ-నిజాంసాగర్

నిజాంసాగర్ మండలం లోని కడవత్ రాజేష్ నడిమితాండ వ్యక్తితో పాటు ఆరేడు గ్రామంలోని శ్రావణ్ అనే వ్యక్తి కొన్ని రోజుల క్రితం తమ ఫోన్లు పోయాయని నిజాంసాగర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారని ఎస్సై సుధాకర్ తెలిపారు. అట్టి ఫోన్లను సిఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి ఫోన్లను రికవరీ చేసి ఫిర్యాదు దారులకు అప్పగించినట్టు తెలిపారు. ఫోన్‌కు సంబంధించి బిల్లులు గాని, ఫోన్ బాక్స్ గానీ ఎలాంటి ఆధారాలు లేకుండా ఎవరైనా ఫోన్లు విక్రయిస్తే అట్టి ఫోన్లను ఎవరు తీసుకోవద్దని ఆయన సూచించారు.



సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్ఐ

ప్రయివేటుకు దీటుగా.. ప్రభుత్వ పాఠశాలలు

బడిబాటలో పెద్దఎత్తున ప్రచారం

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు బడిబాటలో భాగంగా పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నారు. ప్రయివేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య ఉచితంగా లభిస్తున్నట్టు తెలిపారు. అన్ని స్కూళ్లల్లో సౌకర్యాలు మరింత మెరుగుపరిచినట్టు తెలిపారు. ఈ సందర్భంగా పదోతరగతి ఫలితాల్లో సైతం వందశాతం ఫలితాలు వచ్చినట్టు తెలిపారు. ప్రభుత్వ పథకాల పొందుతు న్నట్టు ప్రభుత్వ పాఠషశాలలను సైతం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న 2005-06 బ్యాచ్ విద్యార్థులు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ మండలంలోని తాండూరు జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో 2005 - 2006 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం రోజు బంజారా గ్రామంలో గల ఓ ఫంక్షన్ హాల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా తోటి విద్యార్థులతో కలిసి పాత జ్ఞాపకాలను పంచుకున్నారు. తమకు విద్యను అందించిన గురువులను సన్మానాలు చేసి పాదాభివందనం చేశారు.

రైతుల పక్షపాతి షబ్బీర్‌అలీ

- 20,21,22 ప్యాకేజి పనులపై సమీక్ష హర్షణీయం
- మండల రైతుబంధు సమితి మాజీ అధ్యక్షులు నాగరాజ్ గౌడ్


నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లాకు సాగు నీరు అందించే ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు 20,21,22 ప్యాకేజీ పెండింగ్ పనులపై ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్‌అలీ ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించడం హర్షణీయమని మండల రైతుబంధు సమితి మాజీ అధ్యక్షులు అంకన్నగారి నాగరాజ్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. కామారెడ్డి జిల్లా రైతులకు 2 లక్షల 75 వేల ఎకరాలకు సాగునీరు అందించే ఉద్దేశంతో అప్పటి ముఖ్యమంత్రి స్వర్గీయ వైయస్సార్ హయాంలో ప్రారంభించిన పనులు బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 20.21.22 ప్యాకేజి ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు పూర్తయితే షబ్బీర్‌అలీకి, కాంగ్రెస్ పార్టీకి పేరు వస్తుందని ప్రాజెక్టు పూర్తి కాకుండా పదేళ్ల పాటు కక్ష కట్టి నిధులు ఆపేశారన్నారు. పదేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే షబ్బీర్ అలీ కలలు కన్న 20,21,22 ప్యాకేజి పనులు ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును పట్టుదలతో పూర్తి చేయించడమే లక్ష్యంగా ఇరిగేషన్ అధికారులతో పనుల పురోగతి తెలుసుకొని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రాజెక్టు ప్యాకేజీ పనుల కోసం అవసరమయ్యే నిధులను మంజూరు చేయిస్తానని పనులను వేగవంతం చేసేందుకు కృషి చేస్తాననడం జిల్లా రైతాంగానికి తీపి కబురు అందించారన్నారు. పనులను పూర్తి చేసి జిల్లా రైతులకు నీళ్లు ఇవ్వాలనే ఉద్దేశంతో ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించడం పట్ల ప్రాణహిత చేవెళ్ల ఎత్తిపోతల పథకంపై రైతుల్లో ఆశలు చిగురిస్తున్నా యని, జిల్లా సస్యశ్యామలంగా మారుతుం దని అ ఘనత ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీకే దక్కుతుందని యావత్ జిల్లా రైతాంగం పక్షాన ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

పారిశుధ్యం తొలగించేందుకు
యువత ముందడుగు

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలో పారిశుధ్యం లోపించి ఎక్కడ పడితే అక్కడ చెత్త దర్శనమి స్తుండగా.. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లపైకి చేరింది. చెత్త తొలగించాలని పట్టణానికి చెందిన పలువురు యువకులు శనివారం ఎంపీడీవో నరేష్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ఆదివారం పరిశీలిం చారు. అనంతరం యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి అంబేద్కర్ చౌరస్తా నుండి బాలుర ఉన్నంత పాఠశాలతో పాటు తదితర వార్డుల్లో మురికాలువలో పేరుక పోయిన చెత్తను తొలగించారు. కాలువలో పూడికతీత పనులు చేపట్టాలని ఎంపీడీవోను కోరారు.



పరిసరాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో

ఏకరూప దుస్తుల పంపిణీ



విఆ్యర్థులకు యూనిఫాంలు అందజేస్తున్న హెచ్ఎం

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని బస్వాపూర్ గ్రామములోని ఎంపియూపీఎస్ పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు ఏకరూప దుస్తులను ప్రదాన ఉపాధ్యాయుడు జయచంద్ శనివారం సాయంత్రం పంపిణీ చేశారు. గ్రామస్తులతో కలిసి నిర్వహించిన కార్యక్రమంలో హెచ్ఎం జయచంద్ మాట్లాడుతు యూనిఫాంలు ధరించడం వలన పాఠశాలలో సమన్యాయం జరుగుతుందని, పేద, ధనవంతులు అనే బేధాలు లేకుండా అందరూ సమానంగా ఉంటారని తెలిపారు. పాఠశాలలో ప్రస్తుతం తొంబై మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు పుస్తకాలతో పాటు నోట్‌బుక్కులు, బ్యాగులు ప్రభుత్వమే అందజేస్తుందని తెలిపారు. మధ్యాహ్న భోజనం సౌకర్యం కల్పిస్తుందని, కావున విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్పొరేట్ స్కూళ్లలో ఫీజుల దోపిడీ అరికట్టాలి

- ఎఐడిఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బానోత్ రవి

నవతెలంగాణ-కామారెడ్డి

కార్పొరేట్ ప్రయివేట్ స్కూల్స్‌లో జరుగుతున్న దోపిడీని అరికట్టాలని ఎఐడిఎస్ఎఫ్ ఆల్ ఇండియా డెమొక్రాటిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కామారెడ్డి విద్యార్థి సంఘం ఆఫీసులో ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యా శాఖ అధికారుల అలసత్వంతో కార్పొరేట్ యాజమాన్యాలు ఇష్టమొచ్చినట్టు ఫీజులు పెంచుకుంటూ పోతున్నారన్నారు. పెరిగే ఫీజులతో పేద విద్యార్థులకు చదువులు అందని ద్రాక్షలా మారయని, పాఠశాలల్లో సౌకర్యాలు అంతంత మాత్రమే ఉన్నప్పటికీ ఫీజులు మాత్రం లక్షల్లో వసూలు చేస్తున్నారు. రకరకాల పేర్లతో పుట్టుకొస్తున్న పాఠశాలలు, అడ్మిషన్ మొదలు టై, బెల్టుల వరకు యాజమాన్యాలు నిర్ణయించిన ధర చెల్లించి కొనుగోలు చేయాల్సి వస్తుందన్నారు. రాష్ట్రంలో ఎక్కడా పేరెంట్స్ కమిటీలు ఏర్పాటు చేసిన దాకలాలు లేవు. రాష్ట్రంలో అనుమతులు లేకుండా విచ్చలవిడిగా కార్పొరేట్ పాఠశాలలు ఉన్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి ప్రభుత్వ విద్యను ప్రోత్సహించాలని ఆయన కోరారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా అనుమతిలేని పాఠశాలలు వెంటనే మూసివేయాలని, లేని పక్షాన రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అన్నారు.

విద్యుత్ ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

విద్యుత్ వినియోగదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రతి సోమవారం విద్యుత్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ (డి.ఇ) గణేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని సబ్ డివిజనల్ కార్యాలయంలో ఈనెల 17న సోమవారం నాడు సెలవు రోజు అయినప్పటికీ విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం యధావిధిగా కొనసాగుతుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు వారి సమస్యలను పరిష్కరించుకోవడానికి ఏర్పాటుచేసిన ఈ విద్యుత్ ప్రజావాణి కార్యక్రమాన్ని ఎల్లారెడ్డి మండల విద్యుత్ వినియోదారులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ


భూమయ్య


ప్రకాష్

నగరంలోని ఆనంద్ నగర్‌లోగల పద్మశాలి సంఘం తర్ప 25 నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా భీమనాతి భూమయ్య, ప్రధాన కార్యదర్శిగా వైద్యం ప్రకాష్, కోశాధికారిగా శిరిగని రవీందర్, ఉపాధ్యక్షులుగా ఎంబరి గంగాధర్, కర్నాల సుధాకర్, జాయింట్ సెక్రటరీలుగా బాసం పండరి, సాయినాథ్, ఆర్గనైజర్‌గా సత్యనారాయణ, ప్రచార కార్యదర్శిగా భూమయ్య, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికైన కార్యవర్గం 5 సంవత్సరాల పాటు పనిచేయనుంది. నూతన కార్యవర్గానికి సంఘం సభ్యులు అభినందనలు తెలిపారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని కలిసిన అర్బన్ ఎమ్మెల్యే

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ నుండి నూతనంగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన బండి సంజయ్ కుమార్ ని ఇందూర్ అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఢీల్లీలోని గోమతి భవన్ నార్త్ బ్లాక్ లోని హోం సహాయ శాఖ కార్యాలయంలో ఆయన్ను కలిశారు. మోడీ 3.0 లో తెలంగాణ నుండి ఇద్దరికీ అవకాశం కల్పించినందుకు మోడీకి పార్టీ పెద్దలకు ఈ సందర్భంగా ప్రతేక ధన్యవాదాలు తెలిపారు.


కేంద్ర మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసిన ఎమ్మెల్యే

జిల్లా ప్రజలకు బక్రీద్ శుభాకాంక్షలు: కలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

బక్రీద్ వేడుకను పురస్కరించుకుని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ వేడుకను ఆధ్యాత్మిక వాతావరణంలో ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, సౌభ్రాతృత్వం, సుహృద్భావ వాతావరణం వెల్లివిరియాలని కోరుకున్నారు. దాన ధర్మాలతో ఆధ్యాత్మిక కార్యక్రమాలలో నిమగ్నమైన ప్రజలు సోమవారం నాటి వేడుకను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని అన్నారు.

ప్రతి సోమవారం విద్యుత్ ప్రజావాణి

నవతెలంగాణ-ఆర్మూర్

డివిజన్ విద్యుత్ వినియోగదారులకు తెలియచేయునది ఏమనగా, నేటి నుండి ప్రతి సోమవారం ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 1గంటల వరకు ప్రతి సెక్షన్, సబ్-డివిజన్, ఇఆర్‌ఓ, డివిజన్ ఆఫీస్లలో విద్యుత్ ప్రజావాణి నిర్వహించనున్నట్లు డివిజనల్ ఇంజనీర్ ఆదివారం తెలిపారు.

ఆవుపై దాడిచేసి చంపిన మొసలి

నవతెలంగాణ-ఏర్గట్ల


మృతి చెందిన ఆవు

మండలకేంద్రంలోని పిన చెరువు వద్ద ఆవుపై మొసలి దాడిచేయడంతో ఆవు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన వెలుగు చూసింది. వివారాల్లోకి వెళితే స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏర్గట్ల గ్రామానికి చెందిన మునిమాణిక్యం చాకలి భూమేష్‌కు చెందిన ఆవు మధ్యాహ్నం 1.30 సుమారులో పిన చెరువులో నీరు తాగడానికి వెళ్లింది. అక్కడే మాటు వేసిన మొసలి ఒక్కసారిగా ఆవుపై దాడిచేయడంతో ఆవు అక్కడికక్కడే మృతిచెందింది. దాని వెంట ఉన్న లేగదూడ తప్పించు కుందని అన్నారు. బాధితుడు భూమేష్ మాట్లాడుతూ... చెరువులో మొసలి ఉందని చాలా సార్లు అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులు తెలిపినా వారు పట్టించుకోలేదని, చెరువులో బట్టలు ఉతకాలంటే భయం వేస్తుందని అన్నారు. సుమారు 70వేల రూపాయలు విలువచేసే ఆవు మృతిచెందడంతో భాదిత కుటుంబ సభ్యులు బోరున విలపించారు.

పూర్వ విద్యార్థుల సందడి


అపూర్వ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని బీటీ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1986-1987 బ్యాచ్ పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు వారి గురువులను కలుసుకుని పాత జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. అనంతరం గురువులను ఘనంగా సన్మానించారు. అలాగే వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులను సన్మా నించారు. కార్యక్రమంలో తులసి, విశాల, ధనలక్ష్మి, స్వరూప, భాగ్యలక్ష్మి, లలిత, అన్న మేరి, సుమంగళి, గీత, రాజేశ్వరి, గీత, సరళ, కర్నె శీను, ఉమా కాంత్, శంకర్, సునీల్, అజయ్, రమేష్, సుభాష్, నరేందర్ చారి, వసంత్, వినాయక, కాశీనాథ్, శివాజీ, విజయ్, శివ కుమార్, పూజారి లింగం, రాజేందర్ ,రవి, అనుసయ, అలీ, యూసుఫ్, అయూబ్ ఖాన్ పాల్గొన్నారు.

వికలాంగులకు వీల్ చైర్లు అందజేత

- 1987బ్యాచ్ విద్యార్థుల దాతృత్వం


వికలాంగులకు వీల్ చైర్లను అందజేసిన పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-ఎడపల్లి

వికలాంగులకు వీల్ చైర్లను అందజేసి పూర్వవిద్యార్థులు తమ మానవత్వాన్ని చాటుకున్నారు. మండలంలోని ఏఆర్పి ఉన్నత పాఠశాలకు చెందిన 1987బ్యాచ్ పదవతరగతికి చెందిన పూర్వ విద్యార్థి ఎన్. క్రిష్ణ గోపాల్ తన క్లాస్ మేట్‌లతో కలిసి ఆదివారం ముగ్గురు వికలాంగులకు వీల్ చైర్లను అందజేశారు. వీల్ చైర్లు లేక నడవడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్న వారిని చూసిన క్రిష్ణ గోపాల్ తన స్వంత ఖర్చులతో మూడు వీల్ చైర్లను కొనుగోలు చేసి వారికి అందజేశారు. కార్యక్రమంలో 1987 పదవతరగతి బ్యాచ్ కు చెందిన విద్యార్థులు నేమాని శ్రీనివాస్ రావు, సాయిరెడ్డి, భూమానంద్, పాఠవాల పూర్వ విద్యార్థులు అబ్దుల్ వాహెబ్ బారీ, శ్రీనివాస్ గౌడ్, మంజూర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ భవనాలకు మోక్షం ఎప్పుడో?

- అరకొర వసతులతో అద్దె భవనాల్లో అంగన్వాడి కేంద్రాలు
- ఇరుకు గదులు, అరకొర వసతులు
- ఒకే గదిలో వంట, చదువు
- అవస్థలు పడుతున్న చిన్నారులు

నవతెలంగాణ-బాల్కొండ

0-6 సంవత్సరాల వయస్సు గల పిల్లల విద్య, ఆరోగ్య స్థితిని మెరుగుపరచడానికి, పిల్లల సరైన మానసిక, శారీరక, సామాజిక అభివృద్ధికి పునాది వేయడానికి అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటుచేశారు. వాటికి పక్కాభవనాలు లేక మండల పరిధిలో అద్దె భవనాల్లో సమస్యల వలయంలో చిక్కుకొని కొట్టుమిట్టాడుతున్నాయి.


శిథిలావస్థకు చేరిన భవనంలో అంగన్వాడి కేంద్రం


ఇరుకు గదిలలోనే అంగన్వాడి కార్యక్రమాలు

బాల్కొండ మండల పరిధిలోని 10 గ్రామాల్లో మొత్తం 34 అంగన్వాడి కేంద్రాలు ఉన్నాయి. వాటిలో సొంత భవనాలు ఏడు కేంద్రాలకు మాత్రమే ఉన్నాయి. అవి కిసాన్ నగర్ 1, చిట్టాపూర్ 1, వన్నెల్ బి 2, బస్సాపూర్ 1, ఇత్వార్ పేట్ 1, జలాల్ పూర్ 1 కేంద్రంల చొప్పున ఉన్నాయి. అంగన్వాడీ రెంట్ ఫ్రీ కేంద్రాలు బోదేపల్లి 2, శ్రీరాంపూర్ 1, జలాల్ పూర్ 1, నాగపూర్ 2, బస్సాపూర్ 1 ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతున్నాయి. మిగిలిన 20 కేంద్రాలు అద్దె భవనాలలో కొనసాగుతున్నాయి.అవి కూడా పాడుబడిన ఇండ్లలో, శిథిలావస్థకు చేరిన ఇండ్లలో, సంఘ భవనాల్లో, ఇరుకు గదులలో అరకొర వసతుల మధ్య నడుస్తున్నాయి. పిల్లలకు చుట్టుపక్కల ప్రశాంతమైన వాతావరణం లేకపోవడం, అద్దె భవనాల్లో సరైన వసతులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోపక్క పిల్లలకు బాలింతలకు గర్భిణీలకు దూరంగా కాకుండా వారి పరిసర ప్రాంతాలలో అంగన్వాడి పరిధిలోనే అంగన్వాడి భవనం ఉండాలి అనే నిబంధనతో వసతులు లేకున్నా వారు ఆ భవనాల కోసం 1000 నుంచి 2000 వరకు అద్దె చెల్లిస్తున్నారు. అంగన్వాడి కేంద్రానికి ఒక వంటగది రెండు తరగతి గదులు ఒక బాత్రూంతో పాటు ఆటస్థలం ఉండాలి, ప్రభుత్వం చెల్లించే తక్కువ అద్దెలకు ఇలాంటి వసతులు ఉన్న ఇల్లు దొరికే పరిస్థితి లేదు. ప్రతినెల ప్రభుత్వం పిల్లలకు, గర్భిణీలకు బాలింతల కోసం పంపుతున్న పౌష్టికాహారం, కోడిగుడ్లు, వంట సామాగ్రి ఒకే గదిలో ఉంచడానికి వీలుపడడం లేదని, దానితోపాటు వర్షాకాలం సమీపిస్తుండడంతో పిల్లలను సైతం ఒకే గదిలో కూర్చోబెట్టడం వారికి సమస్యగా మారిందని అంగన్వాడీలు, పిల్లల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా పాలకులు స్పందించి అంగన్వాడి కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించాలని వారు కోరుతున్నారు.

అంగన్వాడి కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించాలి

అంగన్వాడి కేంద్రం నిర్మించాలంటే కనీసం 200 నుంచి 250 గజాల వరకు స్థలం సరిపోతుంది. గ్రామాల లో ప్రభుత్వ స్థలాలు గుర్తించి అంగన్వాడి కేంద్రాలను ఏర్పాటు చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

వెల వెల బోతుతున్న అంగన్వాడి కేంద్రాలు..

ఒకపక్క ప్రభుత్వ పాఠశాలలు మన ఊరు మనబడి, అమ్మ ఆదర్శ పాఠశాల పథకాల ద్వారా మెరుగులు దిద్దుతూ ఉంటే మరోపక్క అంగన్వాడి కేంద్రాలను పట్టించుకోకపోవడంతో వెలవెలబోతున్నాయి. అంగన్వాడి సొంత భవనాల ఏర్పాటుకోసం ఐసిడిఎస్ డిపార్ట్మెంట్, జిల్లా పై అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

-ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎ.శ్రీదేవి

సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర గొప్పది

నవతెలంగాణ-మెండోర

సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని, గౌరవంగా ఉద్యోగ విరమణ పొందడం గొప్ప అదృష్టమని గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. సావెల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం ప్రధాన ఉపాధ్యాయుల ఉద్యోగ విరమణ ఆత్మీయ వీడ్కోలు సన్మాన కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఎంతో మంది విద్యార్థులను ఒక ఉన్నత స్థాయికి తీసుకువచ్చేందుకు అహర్నిశలు కృషిచేసి పదవి విరమణ పొందడం సంతోషదగ్గ విషయం అన్నారు. పదవి విరమణ పొందిన ఉద్యోగులు సమాజసేవలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఉద్యోగ విరమణ పొందిన శ్రీనివాస్ రావు

మాట్లాడుతూ పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తించానని తనకు విధులకు సహకరించిన పాఠశాల ఉపాధ్యాయులకు, గ్రామ ప్రజలకు పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం శ్రీనివాసరావు దంపతులను శాలువాలు కప్పి, మెమోంటోలు అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


పదవి విరమణ పొందిన ప్రధానోపాధ్యయులకు సన్మానం

నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలి

- బీజేపీ

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగంపై కలెక్టర్ విచారణ చేపట్టి న్యాయం చేయాలని బీజేపీ నాయకులు అన్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలో బీజేపీ నాయకులు సంతోష్ మాట్లాడుతూ.. ముప్కాల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో దాదాపు రూ.3 కోట్ల నుంచి రూ.5 కోట్ల రూపాయల మేర అవినీతి జరిగిందని అన్నారు.

2018-2023 సర్పంచ్ కాలపరిమితి వ్యవధిలో చాలా అక్రమాలు జరిగాయని, వాటిపై జిల్లా అధికారులు విచారణ జరిపి జీపీ నిధులు వెనక్కి రప్పించాలని కోరారు.

మాజీ సర్పంచ్ చేసిన అక్రమాలకు పంచాయతీ సెక్రటరీ సస్పెన్షన్ వేటు పడినట్లు గుర్తుచేశారు. మాజీ సర్పంచ్‌కు సంబంధించిన మణికంఠ ఏసీ ఫంక్షన్ హాల్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారని అన్నారు. పెట్రోల్ బంక్ పక్కన మణికంఠ ఏసీ ఫంక్షన్ హాల్ నిర్మించారు. కానీ ఫంక్షన్ హాల్ నిర్మాణ మ్యాప్‌లో అట్టి పెట్రోల్ బంక్ లేనివిధంగా చూపి అనుమతి ఇవ్వడం జరిగిందని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లలో జరిగిన అక్రమాలను వెలికితీసి న్యాయం చేయాలని జిల్లా అధికారులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ అధ్యక్షుడు గడ్డం సంతోష్ రెడ్డి, ముస్కు నర్సయ్య, కళ్ల స్వామి, మ్యాక నర్సయ్య, పెంటు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

జిల్లా కబడ్డీ అసోసియేషన్ విస్తృత స్థాయి సమావేశం


మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రంలో ఆదివారం ఒక ప్రయివేటు ఫంక్షన్ హాల్లో జిల్లా కబడ్డీ అసోసియేషన్ నూతన కార్యవర్గ సమావేశం తొలిసారిగా ఏర్పాటు చేసినట్లు జిల్లా కబడ్డీ ప్రధాన కార్యదర్శి కె.గంగాధర్ రెడ్డి తెలిపారు. జిల్లా అధ్యక్షులు అంద్యాల లింగయ్య అధ్యక్షతన విస్తృత స్థాయి సమావేశం నిర్వహించామని అన్నారు. ఈ సమావేశంలో పలు అంశాలపై తీర్మానాలు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.గంగాదర్ రెడ్డి, ఉపాధ్యక్షులు సుబ్బారావు, ట్రెజరర్ సురేందర్, జాయింట్ సెక్రెటరీ రాజ్ కుమార్, హరిచరణ్, శ్రీను,రాజేందర్ తదిత

సాహిత్య అకాడమి పురస్కారం పొందిన రచయితకు సన్మానం


దల్లిదండ్రులతో యువ రచయిత

నవతెలంగాణ-బోధన్

భారత ప్రభుత్వం ద్వారా సాహిత్య అకాడమి పురస్కారం పొందిన రచయిత రమేష్ కార్తిక్ నాయక్ కు ఆదివారం బోదన్ పట్టణంలోని విజయసాయి హైస్కూల్‌లో పాఠశాల ప్రిన్సిపల్ కృష్ణమోహన్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్బంగ ప్రిన్సిపల్ కృష్ణమోహన్ మాట్లాడుతూ.. విజయసాయి పూర్వ విద్యార్థి రమేష్ కార్తీక్ నాయక్ కేంద్ర ప్రభుత్వం నుండి సాహితీ పురస్కారం అవార్డు అందుకోవడం గర్వకారణమన్నారు. మా పూర్వ విద్యార్థికి మరిన్ని అవార్డులు రావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సంధర్బంగ యువ రచయితకు ఘనంగా సన్మానించారు.

కాలు నొప్పి భరించలేక మహిళా ఆత్మహత్య

నవతెలంగాణ-ఎల్లారెడ్డి


మృతి చెందిన సిద్దవ్వ

ఎల్లారెడ్డి మండల పరిధిలోని దాల్మల్కాపల్లి గ్రామానికి చెందిన మమ్మాయి సిద్దవ్వ(48) కాలు నొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై మహేశ్ వివరాల ప్రకారం.. 5 నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో సిద్ధవ్వ కుడికాలు విరిగింది. అప్పటినుండి సిద్ధవ కాలు నొప్పితో బాధపడుతుందని, కొన్ని రోజులుగా కాలు నొప్పి అధికమవడంతో ఆ నొప్పిని భరించలేక ఈ నెల 13న ఎలుకల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు సిద్ధవ్వను ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పందుతుండగా ఆదివారం ఆమె పరిస్థితి విషమించి మృతి చెందింది. భర్త కిష్టయ్య ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్లో దరఖాస్తు ఇవ్వడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నామని ఎస్ఐ మహేష్ తెలిపారు.

పోచారంలో ఘనంగా బోనాలు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం గ్రామంలో ఆదివారం ఘనంగా బోనాలు నిర్వహించారు ఈ సందర్భంగా గ్రామస్తులు బోనాలతో ఊరేగించి గ్రామదేవతలకు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకొని తమ మొక్కులను చెల్లించుకున్నారు. బోనం నిర్వహణలో పోతరాజుల విన్యాసాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీపీ టేకులపల్లి వినీత, మాజీ సర్పంచ్ విజిత శ్రీనివాసరెడ్డి తోపాటు గ్రామస్తులు గోపాల్ గౌడ్, నందు, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.


బోనాలతో వస్తున్న గ్రామస్తులు

యువతి అదృశ్యం

- కేసు నమోదు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి



మండల పరిధి లోని కళ్యాణి గ్రామానికి చెందిన గులేపల్లి రజిత (19)అనే యువతి అదృశ్యమైనట్లు ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఎల్లారెడ్డి ఎస్ఐ మహేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 15న ఉదయం 7 గంటలకు కూలి పని నిమిత్తం తల్లిదండ్రులు ఇద్దరు బయటకు వెళ్లి తిరిగి మధ్యాహ్నం 12 గంటలకు ఇంటికి వచ్చారు. వారి కూతురు రజిత కనబడకపోవడంతో చుట్టుపక్కల వెతికిన ఆచూకీ లభించలేదు. దీంతో ఆదివారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. యువతి తండ్రి కిషన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ తెలిపారు.

జిజి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సన్మానం


సన్మానించిన పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలో హర్యానా రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి కరందేవ్ కంబోజ్ అల్లుడు సునీల్ గోయల్‌కు ఆదివారం జిజి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయ స్వాగతం పలికి ఘనంగా సన్మానించినట్లు జిజి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ నివేదన్ గుజరాతి తెలిపారు. పట్టణంలోని సుప్రసిద్ధ నవనాథ్ సిద్దుల గుట్టను సందర్శించుకున్నార్బు కార్యక్రమంలో రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు డిజే దయానంద్, జైనంద్, సుమీత్, శర్మ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
5
నిజామాబాద్-కామారెడ్డి
సోమవారం | జూన్ 17, 2024 | www.navatelangana.com

తప్పిపోయిన బాలిక ఆచూకీ లభ్యం

నవతెలంగాణ-భీంగల్

ఈ నెల 15న తప్పిపోయిన బాలిక షేక్ మహిర ఆచూకీ దొరికింది. ఎస్సై హరిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్మూర్ గ్రామానికి చెందిన చిన్నారి భీంగల్ పట్టణానికి చెందిన తన తాత అమీర్ ఖాన్ ఇంటికి వచ్చింది. మతిస్థిమితం లేని చిన్నారి ఆడుకుంటూ బయటకు వెళ్లి తప్పిపోయింది. కుటుంబ సభ్యులు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు బాలిక ఆచూకీ కొరకు మూడు ఐ-బందాలను ఏర్పాటు చేశారు. ఆదివారం స్థానిక రాతం చెరువులో గుర్రపు డెక్కలో చిక్కుకుని కనిపించింది. స్థానికులు, పోలీసుల సహాయంతో గుర్రపు డెక్కలో చిక్కుకున్న బాలికను బయటకు తీసి తల్లి, తండ్రులకు అప్పగించారు. బాలికను సురక్షితంగా అప్పగించిన పోలీసులకు తల్లి, తండ్రులు, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



చిన్నారిని కుటుంబీకులకు అప్పగించిన ఎస్ఐ

నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ అభిలాష అభినవ్

నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ జిల్లా నూతన కలెక్టర్‌గా అభిలాష అభినవ్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బదిలీలలో భాగంగా జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న అభిలాష అభినవ్‌కు నిర్మల్ జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయిన సందర్భంగా ఆదివారం కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో కలెక్టర్‌గా ఆమె బాధ్యతలు స్వీకరించారు. నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన జిల్లా కలెక్టర్‌ను ఆర్డీఓ, ఇతర జిల్లా అధికారులు, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికి మర్యాదపూర్వకంగా పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

10 ఏండ్లుగా ఉద్యోగ భద్రత లేదు



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పనిచేస్తున్న క్యాజువల్ లేబర్(ఫైల్)

- ప్రమాదపు అంచున పనులు
- విద్యుత్ శాఖలో క్యాజువల్ లేబర్
- ఉద్యోగం వస్తుందనే ఆశతోనే ఎదురుచూపులు

నవతెలంగాణ-వర్ని

విద్యుత్ శాఖలో క్యాజువల్ లేబర్ (ఆన్‌మ్యాన్)గా పని చేస్తున్న వర్కర్లకు ప్రభుత్వాలు గుర్తింపు ఇవ్వకపోవటం బాధాకరం. వీరు విద్యుత్ శాఖ లైన్ మెన్ వద్ద గ్రామాల్లో పని చేస్తుంటారు. వీరిని విద్యుత్ శాఖ అధికారులు కాంట్రాక్టు పద్దతిలో తీసుకోని విద్యుత్ పనులు చేయించుకొంటారు. విద్యుత్‌శాఖ అధికారులు ఏ పని చెప్పిన చేస్తుంటారు.

ప్రాణానికి భద్రత లేని ఉద్యోగం

లైన్‌మెన్, ఇతర విద్యుత్ శాఖలో పని చేసే వారి కింద ఉండి కుటుంబ పోషణ కోసం ప్రమాదం అంచున పని చేసే వారిని ఆన్‌మ్యాన్‌గా పిలుస్తారు. వీరు ప్రభుత్వ విద్యుత్ అధికారుల చేతిలో పని చేస్తూ ఉద్యోగం ఖాళీ ఉంటే వారి అనుభవంతో ఉద్యోగం పొందే అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. రాత్రి పగలు ఎప్పుడు కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు విరిగిన పడిన వాటిని తీసేస్తుంటారు. వీరు విద్యుత్తు ప్రమాదానికి గురైన ప్రభుత్వం నుంచి ఎలాంటి బీమా ఉండదు. కాంట్రాక్టు ద్వారా విద్యుత్ శాఖ అధికారులు ఎంతో కొంత చెల్లిస్తే ఆ వేతనాలతోని పని చేస్తున్నారు. అయినా ఎప్పటికైనా అనుభవంతో ఉద్యోగం వస్తుందని ఎదురుచూపులతో ప్రమాదమని తెలిసి కూడా పనిచేస్తూ ప్రజలకు ఎల్లవేళలా సేవలు చేస్తున్నారు.

10 ఏండ్లు అయినా గుర్తింపు లేదు.

(ఆన్‌మ్యాన్) క్యాజువల్ లేబర్‌గా విద్యుత్ శాఖలో 10ఏండ్లు గా విద్యుత్ కార్మికులుగా పని చేస్తున్న ప్రభుత్వం వీరిని గుర్తించటం లేదు. ఎప్పటికైనా, ఏ ప్రభుత్వం అయినా తమను ఆదుకుంటుందని, ఉద్యోగం కలిపిస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నారు. వీరు ఇలా పని చేస్తూ పదేండ్లు అవుతున్న ప్రభుత్వాలు గుర్తింపు ఇవ్వటం లేదు. ఉద్యోగం కలిపించటం లేదు. ఎప్పుడు కరెంట్ పోయిన ప్రమాద అంచున ట్రాన్స్‌ఫార్ల వద్ద ప్రాణాలను కాపాడుకొంటూ ధైర్యంగా పనిచేస్తున్నారు ప్రభుత్వం వీరిని గుర్తించి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించి ప్రమాద బీమాతోపాటు కుటుంబాలకు అండగా ఉండాలని ప్రభుత్వాలకు వీరు వినతిపత్రాలు కూడా ఇచ్చినట్టు సమాచారం. అయినా తమను ఏ ప్రభుత్వం పట్టించుకోవటం లేదని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అయినా తమ కష్టాలను గుర్తించి ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రకటించాలని కోరుతున్నారు.

నేడు విద్యుత్ ప్రజావాణి

నవతెలంగాణ-మోపాల్

మండల కేంద్రంలోని 33/11 కెవి మిషన్ తానా కుర్ద సబ్ స్టేషన్ లో విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం ఉంటుందని మోపాల్ ఎలక్ట్రిసిటీ ఏఈ బాబా శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటుందని పేర్కొన్నారు. మండల విద్యుత్ వినియోగదారులు వారి సమస్యలు ఏమైనా ఉంటే ప్రజావాణి కార్యక్రమం ద్వారా నమోదు చేయించుకోవాలని పేర్కొన్నారు. ఇందల్వాయి మండల విద్యుత్ వినియోగదారులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పాఠశాలలో చోరీపై పోలీస్‌లకు పిర్యాదు

బాలుర పాఠశాలలో ఇన్వెటర్ చోరీ



ఎస్ఐకి వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ఇన్వెటర్, తదితర సామగ్రి చోరీ జరిగిన సంఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు తెలిపిన వివరాల ప్రకారం.. దోమకొండ మండల కేంద్రం లోని జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో శు క్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాలలో కి వచ్చి విలువైన సామగ్రి ధ్వంసం చేసి, ఇన్వెటర్‌ను దొంగలించారని తెలిపారు. ఉపాధ్యాయులు బాపు రెడ్డి, రాధ లక్ష్మి తదితరులు పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశామని తెలిపారు. ఈ విషయంపై ఎస్సై గణేష్ ను వివరణ కోరగా బాలుర పాఠశాలలో ఇన్విటర్ చోరీ జరిగిన సంఘటన పై ఉపాధ్యాయుల నుండి ఫిర్యాదు స్వీకరించమని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మండుతున్న నిత్యావసరాల ధరలు

- వాటితతో పోటీపడుతున్న కూరగాయల ధరలు
- టమాట కిలో రూ.60
- పచ్చిమిర్చి కేజీ రూ.120





నవతెలంగాణ-నిజామాబాద్

రోజు రోజుకు పెరుగుతున్న నిత్యావసర ధరలతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. మండుతున్న కూరగాయల ధరలతో పాటు తామేమీ తక్కువ కామంటూ.. పప్పుల ధరలు సైతం అమాంతంగా పెరిగిపోతున్నాయి. గత రెండు రోజుల కింద కిలో రూ. 40 పలికిన టమాటా ధర ఒకే సారి రూ.60కి చేరుకుంది. పచ్చి మిర్చి సైతం రూ.100 నుంచి 120 ధర పలుకుతోంది. ఇక వివిధ రకాల పప్పుల ధరలు సైతం వినియోగదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. కంది పప్పు కిలోకు రూ.170 నుంచి 180 వరకు ప్రస్తుతం మార్కెట్‌లో ధరపలుకుతోంది. పెసర పప్పు కిలోకు రూ.120, మినమ పప్పు రూ.110, మసూరి పప్పు రూ.100, ఇలా ఏ నిత్యావసర ధరలు చూసుకున్న ఆకాశాన్నంటుతున్నాయి. మొన్నటి వరకు కిలో రూ.25 నుంచి 30 పలికిన ఉల్లిగడ్డ ఒకేసారి కిలో రూ.40కి చేరుకుంది. ప్రస్తుతం మార్కెట్‌లో కూరగాయల ధరలతో పాటు పప్పుల ధరకు సైతం పెరగడంతో ఏమి తినేటట్టు లేదు..ఏమి కొనేటట్టు లేదు అనే చందంగా మారింది. వర్షాలు సకాలంలో కురువక పోవడంతో కూరగాయల ధరలు విపరీతంగా పెరిగాయని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో కిలో కొనేవాళ్లు పావు కిలో సరిపెట్టుకుంటున్నారు. ఏది ఏమైనా నిత్యావసర వస్తువుల ధరలు రోజు రోజుకు పెరిగిపోవడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి

- సాగు దారులపై ఫారెస్ట్ అధికారులు దాడులు ఆపాలి
- టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్ర వ్యాప్తంగా సాగులో ఉన్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, పోడు సాగు చేస్తున్న వారిపై ఫారెస్ట్ అధికారులు దాడులు ఆపాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో సంఘం మాజీ జిల్లా అధ్యక్షులు ఆత్రం భగవంత్‌రావు 4వ వర్ధంతి సభను నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆత్రం భగవంత్‌రావు అత్యంత వెనుకబడ్డ కొలాం ఆదివాసీ తెగ నుంచి వచ్చి సంఘంలో రాష్ట్ర నాయకులు, జిల్లా అధ్యక్షులు వరకు అంచెలంచెలుగా ఎదిగారని కొనియాడారు. ఉట్నూర్ కేంద్రంగా అనేక ఆదివాసుల సమస్యలపై పోరాటలు నిర్వహించి ఆదివాసుల హక్కులకై ఉద్యమించారని తెలిపారు. ఆయన స్ఫూర్తితో నేడు టీఏజీఎస్ నాయకత్వం పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అనంతరం జరిగిన సంఘం జిల్లా కమిటీ సమావేశం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, పోడు సాగు దారులపై ఫారెస్ట్ అధికారుల దాడులు ఆపాలని, పోడు భూముల్లో కంధకాలు తవ్వడం ఆపాలని డిమాండ్ చేశారు. నూతనంగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సాగు దారులపై ఫారెస్ట్ అధికారుల దాడుల విషయంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క కలుగజేసుకొని ఫారెస్ట్ అధికారుల దాడులు ఆపాలని కోరారు. నిన్న హైదరాబాద్ ఫారెస్ట్ అధికారుల సమావేశంలో మంత్రి సీతక్క అనర్హులకు పట్టాలు ఇచ్చారన్న వ్యాఖ్యలను ఖండించారు. ఇంకా అనేక మందికి పోడు పట్టాలు రాలేదని, పట్టా ఉన్న భూములను సైతం ఫారెస్ట్ అధికారులు కంధకాలు, మొక్కల నాటడం పేరుతో దాడులు చేస్తున్నారని అన్నారు. పోడు పట్టాలను పంపిణీ చేయాలనే డిమాండ్‌తో భవిష్యత్‌లో రాష్ట్ర వ్యాప్తంగా టీఏజీఎస్ ఉద్యమం నిర్మిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఉయిక విష్ణు, రాష్ట్ర నాయకులు భీంరావు, జిల్లా నాయకులు మెస్రం మహేష్, కోవ సునీల్, ఈశ్వర్ ఆత్రం కిష్టన్న, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మల్లేష్, కార్యదర్శి కిరణ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి లంక రాఘవులు పాల్గొన్నారు.

ఎస్పీని ప్రశంసించిన కేంద్ర ప్రధాన ఎన్నికల అధికారి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పార్లమెంట్ ఎన్నికలను ఆదిలాబాద్ జిల్లాలో ప్రశాంత వాతావరణంలో, ఎటువంటి చిన్న అవాంఛనీయ సంఘటన జరగకుండా నిర్వహించడానికి ఎంతగానో కృషి చేసిన జిల్లా పోలీసు వ్యవస్థ ఉన్నతాధికారి జిల్లా ఎస్పీ గౌస్ ఆలంకు కేంద్ర ప్రధాన ఎన్నికల అధికారి రాజీవ్ కుమార్ ద్వారా ప్రశంసా పత్రం అందజేసింది. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడం, సిబ్బంది ఎన్నికల విధులను నిర్వర్తించేలా ప్రణాళికలు చేయడం, ప్రజలలో ఓటింగ్‌పై అవగాహనలు కల్పించి, ఫ్లాగ్ మార్చలు నిర్వహిస్తూ, ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించడం. అదేవిధంగా ఎన్నికల సామాగ్రి, ఈవీఎంల భద్రత తదితర అంశాలపై ఉన్నతమైన పనితనాన్ని అభినందిస్తూ, ఈ ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్ జిల్లా ఎస్పీకి శాలువాతో సత్కరించి, సిబ్బందితో కలిసి ప్రశంస పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి కృషి చేసిన జిల్లా పోలీసులందరికీ ప్రత్యేక అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రశంసలు ఉన్నతమైన పనితనాన్ని సాధించడానికి తోడ్పాటును అందజేస్తాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ సీసీ దుర్గం శ్రీనివాస్, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ నవీన్, స్పెషల్ బ్రాంచ్ ఎస్సై అన్వర్ ఉల్ హక్, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్ కవిత, సిబ్బంది సైబర్ సెల్ హెడ్ కానిస్టేబుల్ సంజీవ్ కుమార్, స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది విజయ్, మాజీద్ పాల్గొన్నారు.

బక్రీద్ పండుగకు ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-నిజామాబాద్

బక్రీద్ పండుగ నేపథ్యంలో ప్రార్థనలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టారు. అయితే వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రార్థనలు ఈద్గాలో కాకుండా ఆయా మసీదుల్లోనే ఆచరించేలా మసీదు కమిటీల నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకున్నారు. కాగా మున్సిపల్ ఆధ్వర్యంలో ఈద్గా మైదానంలో పరిశుభ్ర కార్యక్రమాలు కొనసాగగా ఈద్గా కమిటీల ఆధ్వర్యంలో ఇతర పనులు చేశారు. వర్ష సూచనలు ఉన్న నేపథ్యంలో ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. సోమవారం ఉదయం 7:30 నిమిషాలకు ఈద్గాలో నమాజ్ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఒక వేళ వర్షం కురిస్తే ఆయా మసీదుల్లోనే నమాజ్‌లను ఆచరించేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

మోహన్ హత్య ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ చేపట్టాలి

నవతెలంగాణ-ఉట్నూర్

పాత ఉట్నూర్‌కు చెందిన మోహన్‌ను హత్య చేసిన నిందితులకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపి శిక్ష పడే విధంగా చర్యలు చేపట్టాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా లంబాడా జేఏసీ ప్రధాన కార్యదర్శి బానోత్ జగన్ అన్నారు. ఆదివారం ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్‌ని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. వారు సానుకూలంగా స్పందించి న్యాయం జరిగే విధంగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. డీఎస్పీని కలిసిన వారిలో లంబాడా జేఏసీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శులు బానోత్ రామారావు, జిల్లా ఉపాధ్యక్షులు ఆడే సురేష్, నేతావత్ రాందాస్ నాయక్, గణపతి, తరుణ్ ఉన్నారు.

ట్రైబల్ అడ్వైజర్ కమిటీని ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-ఉట్నూర్

ట్రైబల్ అడ్వైజర్ కమిటీని ఏర్పాటు చేయాలని గిరిజన ఆదివాసీ సంఘాల నాయకులు జాదవ్ సుమేష, పెందోర్ దీపకలు అన్నారు. పట్టణంలోని గిరిజన భవనంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రత్యేక ట్రైబల్ అడ్వైజర్ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. జీఓ నెంబర్ మూడును యదావిధిగా కొనసాగించాలని, ఏజెన్సీలో 1/59, 1/70, పిసా చట్టాలను పకడ్బందీగా అమలు చేసి, గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు. ఐటీడీఏలో ఉన్న బ్యాక్‌లాగ్ ఉపాధ్యాయుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. 317 జీఓను పరిగణలోకి తీసుకోకుండా ఏజెన్సీ ప్రాంతం నుంచి ఏజెన్సీ ప్రాంతాల్లో పోస్టులు భర్తీ చేయాలని తెలిపారు. భార్య భర్తలకు దగ్గరగా ఉండే విధంగా చూసుకోవాలి సూచించారు. జీఓ నెంబర్ 3ప్రకారమే ఉద్యోగులు, బదిలీలు ప్రమోషన్ల చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు జాదవ్ చంద్రకాంత్, రామారావు, రాందాస్, మోతీరాం, ప్రకాష్, రమేష్, రాజు, రవీందర్, వంశీ, శ్యామ్‌రావు పాల్గొన్నారు.

గురుకుల డిగ్రీ కాలేజీని సద్వినియోగం చేసుకోవాలి

- 18 నుంచి స్పాట్ కౌన్సెలింగ్
- ఈ నెల 22 వరకు చివరి గడువు :
- ప్రిన్సిపాల్ డాక్టర్ సీఆర్ అన్నపూర్ణ



నవతెలంగాణ-కామారెడ్డి

గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో ఈనెల 18 నుంచి 22 వరకు స్పాట్ కౌన్సిలింగ్ కోసం దరఖాస్తులను కోరుతున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.ఆర్ అన్నపూర్ణ తెలిపారు. సరంపల్లి ఎక్స్ రోడ్ వద్ద గల గిరిజన సంక్షేమ గురుకుల పురుషుల డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం ఈ నెల 18 నుంచి 22 వరకు స్పాట్ అడ్మిషన్లు చేపడుతున్నట్లు ప్రిన్సిపాల్ డా. సి ఆర్ అన్నపూర్ణ శనివారం తెలిపారు. విద్యార్థులు స్పాట్ కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. అన్ని ఒరిజినల్ సర్టిఫికేట్, రెండు ఫోటోలు , ఆధార్ కార్డు నఖలు టిజియూజిసేట్ హాల్ టికేట్ లేదా ర్యాంక్ కార్డు లను తీసుకురావాలని, మరో రెండు జిరాక్స్ సెట్లు కూడా తీసుకురావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7901097707 నెంబర్ కు సంప్రదించాలని పేర్కొన్నారు.

ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులు

ప్రతి సంవత్సరము గురుకుల విద్యార్థులకు వివిద రంగాల్లో ప్రావీణ్యం పొంది ప్రతిభ కనబరుస్తు న్నట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సంవత్సరంలో జరిగిన ఐఐటి జామ్ పరీక్షలో కళాశాల విద్యార్థి నేనవత్ రాహుల్ ఐఐటి హైదరాబాద్‌లో అర్హత సాధించినట్టు తెలిపారు. కాత్రోత్ వినోద్‌కు నీట్ వరంగల్‌లో సీట్ సాధించారని ప్రిన్సిపాల్ వివరించారు. గత సంవత్సరంలో దేవి వీరప్రసాద్ అనే విద్యార్థి సిపిజిఈటి 2023 మ్యాథమెటిక్స్ ఫస్ట్ ర్యాంక్ సాధించారని, నందకుమార్ సిపిజిఈటి 2023, జియాలజికల్ సిక్స్ ర్యాంక్ సాధించాడన్నారు. అదే విధంగా పోలీస్ కానిస్టేబుల్స్‌గా, అగ్నిపథ్ జవాన్‌లుగా పలువురు విద్యార్థులు ఎంపికైనట్టు తెలిపారు. దీంతోపాటు మా కళాశాలలో కోర్సులు బిఏ, బీకాం, ఎంపీసీఎస్, బి జెడ్ సి, ఈ కోర్సులతోపాటు ఎనిసి, ఎన్ఎస్ఎస్, క్రీడలు, లైబ్రరీ, వసతి గృహం లాంటి సౌకర్యాలు ఉన్నాయన్నారు.

రిమ్స్‌లో కొత్త కాంట్రాక్టర్లను నియమించాలి

- మంత్రి సీతక్కకు వినతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్‌లో గత కొన్నేండ్లుగా కొనసాగుతున్న కాంట్రాక్టులకు కాకుండా కొత్త కాంట్రాక్టులను నియమించాలని ఆదిలాబాద్ యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి అన్నారు. ఆదివారం ప్రజాసేవా భవన్‌లో మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రూపేష్‌రెడ్డి మాట్లాడుతూ రిమ్స్‌లో కాంట్రాక్టర్లు అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని అన్నారు. గత కొన్నేండ్లుగా కృష్ణ కన్స్‌ట్రక్షన్, మహాలక్ష్మి మ్యాన్ పవర్ ఏజెన్సీ వారే కొనసాగుతున్నారని అన్నారు. వారు రిమ్స్‌లో ఉద్యోగ నియామకాల్లో ఒక్కొక్కరి నుంచి లక్ష నుంచి రెండు లక్షల రూపాయల వసూలు చేశారని మంత్రికి తెలిపారు. ఉద్యోగం కావాలని వచ్చిన అమాయక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. అంతేకాకుండా ఈ ఏజెన్సీల వల్ల కార్మికులు కూడా చెప్పుకోలేని బాధలతో సతమతమవుతున్నారని అన్నారు. ముఖ్యంగా ప్రతి యేటా వీరే లోపాయి కారి ఒప్పందం ద్వారా తమ కాంట్రాక్టులను రెన్యువల్ చేసుకుంటూ వెళు తున్నారని ఇది కరెక్ట్ కాదని, కొత్త వారికి అవకాశం ఇవ్వాలని కోరారు. కొత్త కాంట్రాక్టులను నియమించే క్రమంలో పత్రికా ప్రకటన ద్వారా బహిర్గతంగా కాంట్రాక్టర్లను నియమించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇంకా అవకాశం కోసం ఎదురుచూసే అనేక మంది నిరుద్యోగులకు కొత్త కాంట్రాక్టర్ల ద్వారా ఉపాధి కల్పించే అవకాశం ఉంటుందని తెలిపారు. అందుకు వెంటనే రిమ్స్‌లో గత కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతున్న కృష్ణ కన్స్‌ట్రక్షన్‌తో పాటు మహాలక్ష్మి మ్యాన్ పవర్ ఏజెన్సీ వారిని తొలగించాలని, కిట్స్ టెండర్లు, బ్లడ్ బ్యాంక్ టెండర్, ఆరోగ్యశ్రీ ఇంప్లాంట్స్ టెండర్ కుడా వేయడం లేదని అన్నారు. వీరి స్థానంలో కొత్తవారిని నియమించాలని మంత్రిని కోరడం జరిగిందని తెలిపారు.

బక్రీద్ పండుగకు భారీ బందోబస్తు ఏర్పాటు

- 6 అంతర్ రాష్ట్ర, 6 అంతర్ జిల్లా చెక్ పోస్టులు
- జిల్లా ప్రజలకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు
- ఎస్పీ గౌస్ ఆలం



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

బక్రీద్ పండుగను జిల్లా ప్రజలు మత సామరస్యాన్ని కాపాడుతూ ప్రశాంతంగా నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ గౌస్ ఆలం తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, బక్రీద్ పండుగ సందర్భంగా ఏర్పాటుచేసిన బందోబస్తు నిర్వహించబోయే అధికారులతో ఆదివారం టెలికాన్ఫరెన్స్ ద్వారా సమావేశమై సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గత 20 రోజులుగా ఆరు అంతర్‌రాష్ట్ర, ఆరు అంతర్ జిల్లా చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి, ప్రతి చెక్ పోస్ట్‌లో 5 గురు సిబ్బందిని ఏర్పాటు చేసి, 24 గంటలు వాహనాల తనిఖీలు చేపట్టి ఆవుల అక్రమ రవాణా జరగకుండా విధులను నిర్వర్తిస్తు న్నట్లు తెలియజేశారు. ఆదిలా బాద్, ఇచ్చోడ, ఉట్నూర్ మూడు ప్రధాన పట్టణాల్లో ఆకస్మిక తనిఖీలను నిర్వర్తిస్తూ, అక్రమ రవాణా జరగకుండా కాపాడుతూ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకు న్నట్టు తెలియజేశారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఆదిలాబాద్ పట్టణంలో, జిల్లా వ్యాప్తంగా పటిష్ఠ బందోబస్తుల ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజలు సామాజిక మాధ్యమాలలో వచ్చే వదంతులను న వ ్మ క ొ ా డ ్ ద ్ ని తెలియజేశారు. ఎటువంటి సమాచారం అందజేయాలన్న డైల్ 100 లేదా సంబంధిత పోలీస్ స్టేషన్లకు సంప్రదించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.సురేందర్‌రావు, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్ జీవన్‌రెడ్డి, సీహెచ్ నాగేందర్, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

నాల్గవ తరగతి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సీఎం కృషి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నాల్గవ తరగతి ఉద్యోగుల సమస్యల పరిష్కరానికి సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని, ఏపీలో ఉన్న ఉద్యోగులను తెలంగాణకు తీసుకోవాలని విన్నవించగా స్పందించి, ఫైలును పంపించారని తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగాధర్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని సంఘ భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం సభ్యులతో కలిసి మాట్లాడారు. గత ప్రభుత్వ హయంలో ఉద్యోగులకు 20వ తేది వరకు వేతనాలు వచ్చేవని, కాంగ్రెస్ హయంలో ప్రతి నెల 5వ తేదిలోపు వేతనాలు వస్తున్నాయన్నారు. పదేండ్లుగా ఏపీలో నాల్గవ తరగతి ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారని వారిని తెలంగాణకు తీసుకురావాలని విన్నవించిన వెంటనే సీఎం స్పందించినట్లు తెలిపారు. అదే విధంగా పార్ట్ టైమర్ ఏఎన్ఎం, డెయిలీ వేజ్ వారికి రూ.30 వేల నుంచి స్కూల్‌లు ఫీజు ఇవ్వాలని పీఆర్సీ కమిషనర్‌ను కోరడం జరిగిందని తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కరం కోసం సంఘం పని చేస్తుందని అన్నారు. సమావేశంలో సంఘం నాయకులు ఉన్నారు.